దుండిగల్ సర్వే నెం.453, 454, భూముల ల్యాండ్ పూలింగ్ గ్రామ సభలో తహశీల్దార్- ఆర్డీవో..ఆగష్టు 7 నాటి చిత్రం..

పెన్ పవర్ తెలంగాణ రౌండప్

అక్రమ రూముతో పాటు, సుమారు 120 గజాలకు ప్రహరీగోడ నిర్మాణం..

ఓవైపు 'భూ సేకరణ'..! మరోవైపు కబ్జాలు..?

పల్లవి ఆశ్రమం వెనుకవైపు 'అక్రమంగా ఒక రూము నిర్మాణంతో పాటు ప్రహరిగోడ..

- దుండిగల్ సర్వే నెంబర్ 453, 454లో భూ సేకరణకు గ్రామ సభలు నిర్వహించిన దుండిగల్ తహశీల్దార్..
- గత ఆగష్టు 7న- 14వ తేదిన అసైనీ రైతులతో ఎమ్మార్వో రాజేశ్వర్ రెడ్డి, ఆర్డీవో శ్యామ్‌ప్రకాశ్ సమీక్షలు..
- పల్లవి ఆశ్రమం వెనుక కొత్తగా రూము నిర్మించి, ప్రహరీగోడ నిర్మాణం పూర్తి చేసినా చర్యలు శూన్యం..
- చర్యలు తీసుకోకుండా రెవెన్యూ అధికారుల మౌనానికి అర్థం..? ఏమిటని తలెత్తుతున్న ప్రశ్నలు..?
- ఇదే కబ్జాదారుడు గతంలో సర్వే నెం.120లోనూ రెవెన్యూ అధికారుల అండతో కబ్జారోపణలు..?
- దుండిగల్ తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ కబ్జాల వ్యవహారంపై విమర్శలు..?
- బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో కబ్జాల జాతర..
- 2024 మే 7న సురేందర్ రెడ్డి అక్రమ నిర్మాణంపై తహశీల్దార్ నోటీసులు ఇచ్చినా, చర్యలు శూన్యం..
- బౌరంపేట్ వెళ్ళేదారిలో వివిధరకాల వ్యాపారాల పేరుతో 227 ప్రభుత్వ భూమి కబ్జాలు..
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న దుండిగల్ రెవెన్యూ అధికారులు.. ఖరీదైన కబ్జాదారులకు వత్తాసు..?

- దుండిగల్ సర్వే నెం.453, 454లో మొత్తం 511.24 ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్ భూమి..
- ప్రజా అవసరాలకి 129.28 ఎకరాలు కేటాయించగా..! మిగులు భూమి 382.36 ఎకరాలు..
- అదే భూమికి గ్రామ సభలు ల్యాండ్ పూలిగ్..! రెవెన్యూ నిర్లక్ష్యంతో కబ్జాలు, అక్రమ నిర్మాణాలు..!

-4లో

పల్లవి ఆశ్రమం వెనుకవైపు సర్వే నెం.454 ప్రభుత్వ భూమి, ఆక్రమణ కోసం గది నిర్మాణం..

ఎల్‌నినో ఎఫెక్ట్..!
నీటి ఎద్దడిని ముందే అరికడదాం..!

-5లో

- సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ విద్యార్థులతో ర్యాలీ..
- ప్రతి నీటి బొట్టు అమూల్యమే.. వర్షపు నీటిని ఒడిసిపడితేనే భవిష్యత్తుకు భరోసా..!
- ఇంకుడు గుంతలుంటేనే బోర్లకు అనుమతి ఇవ్వాలి.. రిజిస్ట్రేషన్‌లు చేయాలి..
- బ్యాంకు రుణాలకూ జల సంరక్షణ నిబంధనలు విధిగా వర్తింపజేయాలన్న రవీందర్ ముదిరాజ్..
- సూరారంలో నార్త్ సిటీ విద్యార్థుల భారీ ర్యాలీ.. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన..
- ఎల్‌నినో ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలతో.. నీటి సంరక్షణపై నార్త్ సిటీ విద్యార్థుల చైతన్య ర్యాలీ..!
- ప్రతి వర్షపు బొట్టునూ ఒడిసిపట్టాలి.. భూగర్భ జలాల పరిరక్షణే లక్ష్యంగా ముందడుగు వేయాలి..!
- ఇంకుడు గుంతలుంటేనే బోరు అనుమతులు ఇవ్వాలి.. రవీందర్ ముదిరాజ్ డిమాండ్..!
- ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు.. బ్యాంకు రుణాల్లోనూ జల సంరక్షణకు ప్రాధాన్యం కల్పించాలి..!
- స్నానం నుంచి మొదలుకొని భోజనం వరకు.. ప్రతి ఇంటా నీటి పొదుపు అలవాట్లు పాటించాలని సూచనలు..!
- నీటిని వృథా చేయబోమంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ.. సూరారం వీధుల్లో నినాదాలు, అవగాహన..
- నేటి నిర్లక్ష్యమే రేపటి నీటి సంక్షోభం.. వర్షపు నీటి సంరక్షణకు ప్రజలు, అధికారులు నడుం బిగించాలి..!

15 నుంచి రాతి నిర్మాణాల పనులు

రామాలయం అభివృద్ధి పనుల్ని సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్ పెన్ పవర్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, నవంబరు 15 నుంచి రాతి నిర్మాణాల పనులు ప్రారంభమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సర్పంచి పూనెం కృష్ణ, అధికారులతో కలిసి గురువారం రాములవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ దామోదర్‌రావు సాదర స్వాగతం పలకగా అర్చకుల పర్యవేక్షణలో వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష చేసి ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, పుష్కరాల ఏర్పాట్ల గురించి అధికారులకు కీలక సూచనలు చేశారు. దీనికి ముందు ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే కొన్ని పనులు స్లాబ్‌ల వరకు పూర్తయ్యాయని, కాంక్రీట్ నిర్మాణాలతోపాటు మాడవీధుల ఏర్పాటు పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలకల్లా ఆలయ అభివృద్ధితో పాటు పుష్కర ఘాట్లు సుందరంగా తయారు కావాలని స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి దీపావళి కానుక పేరుతో కొత్తరకం మోసం

హైదరాబాద్ పెన్ పవర్: ప్రధాని దీపావళి కానుక పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్తరకం మోసానికి తెరలేపారు. ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వ పథకం పేరుతో దీపావళి పండుగ సందర్భంగా ప్రజలకు రూ.8,000 ఇస్తామంటూ వాట్సాప్‌లో - మిగతా 6లో...

ఓవైపు 'భూ సేకరణ'..! మరోవైపు కబ్జాలు..?

227లో నోటీసులు ఇచ్చిన సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డుపై చర్యలేవి సర్..



GOVERNMENT OF TELANGANA
(REVENUE DEPARTMENT)

Office of the Tahsil,
Gandimaisamma-Dundigal Mandal.

Dated:07.05.2024.

o.B/528/2024

NOTICE UNDER SECTION 7 OF
A.P. LAND ENCROACHMENT ACT III OF 1905

um. Gaddam Sahiti Reddy D/o. G.Surender Reddy

Whereas you are reported to be un-authorized occupation of the land pecified in the scheduled below, which is the property of Government. You are ereby given notice that if you desire so you may, before [illegible] show cause either in erson or in writing before me/the Collector why you should not addition to the ıll assessment on the land under section (3) (1) of the Act to the rate prescribed by r under section 3 (ii) of the act to charged a penalty for such occupation under ection 5 of Act III of 1905 or and be subjected to eviction from the land and things deposited there on under section 6 of the said Act.

Name of Village	Sy. No. and Sub-Division	Description of land	Total extent Ac-gts.,	Encroached extent Ac-gts.,	Nature of Occupation
Bahadurpally	227	Poramboke	353-35	400 sq.yds (approx)	(01) Shed

In view of the above the Girdawar of this office are directed to service and to return the served copy.

Tahsildar,
Gandimaisamma-Dundigal Mandal.

బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డుకు నోటీసులు జారీచేసి దాదాపు "రెండున్నర" ఏళ్ళు గడిచినా చర్యలు తీసుకోలేదంటే అర్థం..? ప్రభుత్వ భూమి ప్రైవేటు భూమి అయిందా..? సదరు అక్రమ షెడ్డుకు రూ. లక్షల్లో ముడుపులు ముట్టాయని, అందుకే చర్యలు లేవని ఆరోపణలు నిజమేనా..? ప్రస్తుతం బౌరంపేట్ రోడ్డులో 227 ప్రభుత్వ భూమిలో వ్యాపారాల ముసుగులో ఈ ఆక్రమణల జాతరకు లంచాలే కారణమా..? గతంలో కంటైనర్‌లు తొలగించిన అదే ప్రాంతంలో ఇప్పుడు ఎలా ఆక్రమణకు గురయ్యాయి..? దుండిగల్ రెవెన్యూ అధికారులకు తెలియకుండా సాధ్యమేనా..? దాదాపు 26 ఏళ్ళుగా, నేటికీ హైకోర్టు పరిధిలోనే ఉన్న 353.3 ఎకరాల సర్కారీ పోరంబోకు భూమి కబ్జాలో రెవెన్యూ అధికారుల సహకారమే కీలకంగా మారిందా..? భూములు కాపాడలేని రెవెన్యూ అధికారులు విధుల్లో ఎందుకు..? హోదాలతో అలంకార ప్రాయంగా తయారైన సంబంధిత రెవెన్యూ అధికారులపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి..

దుండిగల్ సర్వే నెం.454 ప్రభుత్వ భూమిలో 2019 నాటి హెచ్చరిక బోర్డు.. ఇప్పుడు లేదు ఏమైంది..?

అదేవిధంగా దుండిగల్-గండిమైసమ్మ మండలం బహుదూర్‌పల్లి గ్రామ శివారు సర్వే నెంబర్ 227 ప్రభుత్వ పోరంబోకు భూమి 353.35 ఎకరాలు రోజు రోజుకు ఆక్రమణకు గురవుతుందని ఆర్డీవో శ్యామ్‌ప్రకాశ్‌తో వివరించగా, స్పందించి తహశీల్దార్‌తో చర్యలకు ఆదేశిస్తానని తెలిపారు.. ఇప్పటికే 227 ప్రభుత్వ భూమిలో "సురేందర్ రెడ్డి"కి

బహుదూర్‌పల్లి 227 తాజా కబ్జలాపై ఆర్డీవో..

చెందిన 400 గజాల్లో అక్రమ షెడ్డుకు "2024 మే 7న" అప్పటి తహశీల్దార్ మతీన్ 10 రోజుల వ్యవధిలో షెడ్డును తొలగించుకోవాలని జారీచేసిన నోటీసులో పేర్కొన్న తహశీల్దార్, నేటికి చర్యలు చేపట్టిన రెవెన్యూ అధికారులు లేరు.. ఆతర్వాత గత రెండు మూడు నెలలుగా బహుదూర్‌పల్లి చౌరస్తా నుంచి బౌరంపేట్ వెళ్ళేదారిలో "కుడి-ఎడమలకు" ఉన్న 227 సర్కారీ పోరంబోకు భూమిలో కబ్జాల పర్వం దర్జాగా కొనసాగుతుంది.. దుండిగల్ రెవెన్యూ అధికారుల అండతో ఒకరు కంటైనర్‌లు ఏర్పాటు చేస్తుంటే.. మరొకరు వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ల వ్యాపారం.. కొందరు బస్సుల పార్కింగ్.. మరికొందరు డీసీఎం వాహనాలు పార్కింగ్ చేస్తుంటే.. మరికొందరు వివిధరకాల వ్యాపారాలతో 227 ప్రభుత్వ భూమిని ఆక్రమణతో దందా కొనసాగిస్తున్నారు అనే ఆరోపణలు తలెత్తుతున్నాయి.. ఈ విషయమై ప్రశ్నించడానికి, తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి ఫోన్ బ్లాక్ చేసి బాధ్యత రాహిత్యంతో వ్యవహరిస్తుండగా.. ఆర్ఐ రజనీకాంత్‌కు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తడు, సమాధానం చెప్పడు.. అయితే 227 ప్రభుత్వ భూమిలో ఈ తాజా ఆక్రమణల వ్యవహారం అంతా, ఆర్ఐ రజనీకాంత్‌కు తెలిసే జరుగుతున్నట్టు స్థానికుల ఆరోపణలకు, నిలువెత్తు సాక్ష్యంగా ప్రస్తుత కబ్జాల పర్వం బలం చేకూరుస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి..

అక్రమ నిర్మాణాలపై..! ఆర్డీవోతో..!

దుండిగల్ సర్వే నెంబర్ 453, 454 ప్రభుత్వ అసైన్డ్ భూమిని భూ సేకరణకై గ్రామ సభలు, సమావేశాలకు ప్రతిసారీ హాజరైన మల్కాజ్‌గిరి డివిజన్ ఆర్డీవో శ్యామ్‌ప్రకాశ్ దుండిగల్ సర్వే నెంబర్ 454 ప్రభుత్వ భూమిలో తాజాగా వెలసిన అక్రమ నిర్మాణంతో పాటు, బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ పోరంబోకు భూమి ఆక్రమణలపై ప్రస్తావించగా ఆయన స్పందించారు.. మొదట దుండిగల్ అసైన్డ్ భూమి, భూ సేకరణ (ల్యాండ్ పూలింగ్)కు, గ్రామ సభలో రైతుల డిమాండ్‌లతో ఓకొల్లిక్కి వచ్చిన అదేస్థలంలో అక్రమ నిర్మాణం అంశంపై, ఆర్డీవో ఆసక్తికర సమాధానం ఇచ్చారు.. 453, 454 భూమిలో అక్రమ కట్టడాలను వదిలేసే ప్రసక్తే లేదని, సంబంధిత గదుల నిర్మాణం స్వాధీన పరుచుకుంటామని, వెంటనే తహశీల్దార్‌ను ఆదేశించనున్నట్లు ఆర్డీవో శ్యామ్‌ప్రకాశ్ తెలిపారు..

ఓవైపు అసైనీ రైతుల నుండి భూ సేకరణకు గ్రామ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు.. చివరికి రైతులను ఒప్పించి ఓ నిర్ణయానికి వచ్చిన అదే భూమిలో, వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు సంబంధిత రెవెన్యూ అధికారుల అండ దండలు ఉన్నాయనే ఆరోపణలు నిజంగా బాధాకరం..? మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, దుండిగల్-గండిమైసమ్మ మండలంలో ప్రభుత్వ భూములకు నిజంగా భద్రత ఉందా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.. దుండిగల్ సర్వే నెంబర్ 453, 454 ప్రభుత్వ అసైన్డ్ భూమిలో మొత్తం 511.24 ఎకరాలు భూమి ఉండగా.. ఇప్పటికే ప్రజా అవసరాల కోసం 129.28 ఎకరాలు కేటాయించగా..! మిగులు భూమి 382.36 ఎకరాలు భూ సేకరణలో భాగంగా దుండిగల్ గ్రామ అసైనీ రైతులతో పలుమార్లు సమావేశాలు, గ్రామసభలు నిర్వహించి ఒప్పించారు.. ఇపుడు అదే ప్రభుత్వ భూమిలో, దుండిగల్-గండిమైసమ్మ మండలం తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఓ కబ్జాదారుడు అక్రమంగా గదిని నిర్మించి చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడంపై రెవెన్యూ అధికారుల విధుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తుంది.. ఈ కబ్జా వ్యవహారంపై కొందరు మీడియా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా, చర్యలు చేపడతామని చెపుతూనే కాలయాపన చేస్తూ, కబ్జాదారునికి బహిరంగంగానే సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. కబ్జాలపై వివరణ కోరేందుకు పెన్ పవర్ ప్రతినిధి సంబంధిత ప్రాతాల ఆర్ఐలు రవికుమార్, రజనీకాంత్ లకు వారివారి ఏరియాలో కబ్జాలపై ఫోన్‌లో పలుమార్లు ప్రయత్నించినా ఫోన్‌లు ఎత్తకపోవడంపై అనుమానాలను రేకెత్తిస్తుంది.. ఇద్దరు ఆర్ఐలు ఇలా ఉండగా తహశీల్దార్ సారు రూటే సపరేటు.. సారు బాధ్యతలు చేపట్టిన 2-3 నెలలకే అధికారిక ఫోన్‌ను కూడా బ్లాక్ చేసిమరి నియంతృత్వ ధోరణిని వాడుకోవడం కీలక ఆరోపణలు తలెత్తుతున్నాయి..

జవాబుదారీతనానికి తిలోదకాలు పలికాడని తేటతెల్లం చేస్తోంది.. సమాధానాలకు దూరం ఉండే అధికారులు గమనించాల్సిన విషయం ఏమిటంటే.. మీడియా ప్రతినిధులు ప్రశ్నించేది ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై మాత్రమే.. మీ సొంత ఆస్తుల గురించి కాదని గుర్తించాలి..మరోవైపు సదరు తహశీల్దార్ తీరుపై అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డితో ప్రస్తావించినా..! మేమందరం ఒకటే కదా అన్నట్టు నిర్లక్ష్యం వహించినట్టుగా ప్రశ్నలు లేవనెత్తుతోంది..

దుండిగల్ రెవెన్యూ అధికారుల విధులకు తిరుగు లేదనే చెప్పాలి.. అక్రమ నిర్మాణాల పట్ల సహకారాలే కానీ..! చర్యల ప్రస్తావనకు చోటు ఉండదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..మరోవైపు అక్రమ షెడ్లకు కులమే బలంగా నిలుస్తుందనే ఆరోపణలు కీలక ప్రశ్నలు లేవనెత్తుతోంది.. హైకోర్టు పరిధిలోనే 25 ఏళ్ళుగా ఉన్న బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ పోరంబోకు భూమి 353.35 ఎకరాలు అక్రమ షెడ్లకు నోటీసులు ఇచ్చిన నాటి తహశీల్దార్..? సెటిల్మెంట్‌లతో రెండున్నర ఏళ్ళుగా చర్యల విస్మరణ..? గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో కలెక్టర్ గౌతమ్ పోట్రు డీ-నోటిఫికేషన్‌తో 22-ఎ నిషేధిత జాబితాలో పెట్టిన సర్వే నెంబర్ 145 భూదాన్ భూమిలో అక్రమ షెడ్లకు దుండిగల్ రెవెన్యూ అధికారుల బహిరంగ సహకారం.. ప్రశ్నిస్తే ఓ ప్రజాప్రతినిధి సిఫార్సుగా అవగాహనా రాహిత్యంతో ఆ అధికారి సమసధానంపై అనుమానాలు..? అదే భూదాన్ భూమిలో ఆర్ఐ రవికుమార్ కూల్చేసిన అక్రమ షెడ్డును మళ్ళీ పూర్తిచేసినా చర్యలు లేకపోవడంపై, భారీగా ముడుపులు స్వీకరించి ఉంటారని అవినీతి ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.. రెవెన్యూ కార్యాలయాలు, ఒక తహశీల్దార్, పరిమితికి తగిన ఆర్ఐలు, జీపివోలు, వీళ్ళకు రెవెన్యూ సిబ్బంది ఇంతమంది ఉన్నా, ఏడాదికి ఏడాది అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములు.. ఇంత మంది అధికారులు ప్రభుత్వ భూముల పరిరక్షణకా..? కబ్జాదారులకు కట్టబెట్టడానికా..? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.. దుండిగల్-గండిమైసమ్మ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, ప్రశ్నించిన మీడియా ఫోన్‌లను బ్లాక్ చేసిమరి వివరణకు దూరం ఉండటం గమనార్హం.. ఆవుచేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా..? ఎవరి దందా వారిదే అన్నట్టు..? ఇద్దరు ఆర్ఐలు కూడా కబ్జాలపై వివరణ కోసం ఫోన్‌లు చేసినా, ఫోన్ ఎత్తకపోవడం విశేషం.. ఈ విషయాన్ని పలుమార్లు మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 29:

బహుదూర్‌పల్లి చౌరస్తా నుండి బౌరంపేట్ వెళ్ళేదారిలో 227 భూమి ఆక్రమణకై షెడ్లు..

బౌరంపేట్ రోడ్డులో 227 ప్రభుత్వ భూమి ఆక్రమణ కోసం ఈ వ్యాపారం..

బౌరంపేట్ వెళ్ళే దారిలో, 227లోనే కొత్తగా గుట్టపైన అక్రమంగా కంటైనర్..

సూరారంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ..

ప్లాస్టిక్ నియంత్రించి.. విస్తరాకులనే వాడాలని చూపుతున్న రవీందర్ ముదిరాజ్..

ఎల్‌నినో ఎఫెక్ట్..!

నీటి ఎద్దడిని ముందే అరికడదాం..!

- సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ విద్యార్థులతో ర్యాలీ..
- ప్రతి నీటి బొట్టూ అమూల్యమే.. వర్షపు నీటిని ఒడిసిపడితేనే భవిష్యత్తుకు భరోసా..!
- ఇంకుడు గుంతలుంటేనే బోర్లకు అనుమతి ఇవ్వాలి.. రిజిస్ట్రేషన్‌లు చేయాలి..
- బ్యాంకు రుణాలకూ జల సంరక్షణ నిబంధనలు విధిగా వర్తింపజేయాలన్న రవీందర్ ముదిరాజ్..
- సూరారంలో నార్త్ సిటీ విద్యార్థుల భారీ ర్యాలీ.. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన..
- ఎల్‌నినో ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలతో.. నీటి సంరక్షణపై నార్త్ సిటీ విద్యార్థుల చైతన్య ర్యాలీ..!
- ప్రతి వర్షపు బొట్టునూ ఒడిసిపట్టాలి.. భూగర్భ జలాల పరిరక్షణే లక్ష్యంగా ముందడుగు వేయాలి..!
- ఇంకుడు గుంతలుంటేనే బోరు అనుమతులు ఇవ్వాలి.. రవీందర్ ముదిరాజ్ డిమాండ్..!
- ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు.. బ్యాంకు రుణాల్లోనూ జల సంరక్షణకు ప్రాధాన్యం కల్పించాలి..!
- స్నానం నుంచి మొదలుకొని భోజనం వరకు.. ప్రతి ఇంటా నీటి పొదుపు అలవాట్లు పాటించాలని సూచనలు..!
- నీటిని వృథా చేయబోమంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ.. సూరారం వీధుల్లో నినాదాలు, అవగాహన..
- నేటి నిర్లక్ష్యమే రేపటి నీటి సంక్షోభం.. వర్షపు నీటి సంరక్షణకు ప్రజలు, అధికారులు నడుం బిగించాలి..!

సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు, ప్లాస్టిక్ నియంత్రణకు నిత్య పోరాట యోధుడు, ఈతను (స్విమ్మింగ్) పాఠ్యాంశంగా చేర్చి జలమరణాలు పునరావృతం కాకుండా 20 ఏళ్ళుగా నేతల చుట్టూ ప్రదక్షిణలు.. నాడు కరోనా సమయంలోనూ, నేడు భయపెట్టిస్తున్న ఎల్‌నినోతో నీటి సంక్షోభాన్ని అధిగమించడానికి.. సమస్య ఏదైనా, దానిని జయించడానికి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుండి ర్యాలీలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేస్తున్న కోలా రవీందర్ ముదిరాజ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బహుశా తెలియని వాళ్ళు ఉండక పోవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. ప్రస్తుతం ప్రపంచంలో సుమారు 100 దేశాలతో పాటు, భారత దేశాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని వణికిస్తున్న సమస్య "ఎల్‌నినో"ను అధిగమించడానికి, రవీందర్ ముదిరాజ్ గురువారం, సూరారం వీధుల్లో, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు.. నీటి పొదుపును దృశ్య రూపకంగా మైకు ద్వారా వివరించడం పలువురిని మంత్రముగ్ధులను చేసింది.. మోదుగు విస్తరాకులను చూపుతూ ప్లాస్టిక్ నియంత్రణకు అవగాహన కల్పించారు.. ఇంకుడు గుంతలు ఉంటేనే బోర్లకు అనుమతి లాంటి వాటిని జలసంరక్షణలో భాగంగా తప్పనిసరి చేయాలని ఆయా ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులకు విజ్ఞప్తి చేశారు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 29:

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూగర్భ జలాలపై ఒత్తిడి.. ఇవన్నీ రానున్న రోజుల్లో, తీవ్ర నీటి సంక్షోభానికి దారితీసే అవకాశం ఉందని ఆందోళన కలిగిస్తున్నాయి.. ఈ నేపథ్యంలో ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని చాటుతూ, సూరారం "నార్త్ సిటీ పాఠశాల" విద్యార్థులతో కలిసి, సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ భారీ ర్యాలీ నిర్వహించారు.. నీటిని వృథా చేయొద్దు.. వర్షపు నీటిని ఒడిసిపట్టు.. ఇంకుడు గుంతలను నిర్మించుకో అంటూ నినాదాలు చేస్తూ. పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, సూరారం ప్రాంతంలో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రజలను ఆలోచింపజేసింది.. ఎల్‌నినో హెచ్చరికలతో నీటి సంరక్షణే పరిష్కార మార్గంగా..! ప్రతి ఒక్కరూ పాటించాల్సిన నియమ నిబంధనలను పేర్కొంటూ విద్యార్థులతో చేపట్టిన భారీ ర్యాలీలో, రవిందర్ ముదిరాజ్ ఎల్‌నినో ప్రభావంపై వివరించిన తీరును పలువురు అభినందించారు.. ప్రశాంత మహాసముద్రంలోని, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకునే మార్పుల వల్ల ఏర్పడే ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతుందని అన్నారు.. భారతదేశంలో నైరుతి రుతుపవనాల వర్షపాతంపై కూడా దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది. 2026లో దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, కొన్ని ప్రాంతాల్లో జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం నీటి నిర్వహణలు, ప్రాధాన్యతను మరోసారి గుర్తుచేస్తున్నాయని వివరించారు.. రానున్న కాలంలో, వర్షపాతం ఎలా ఉంటుందన్నది ఇతర వాతావరణ పరిస్థితులపైనా ఆధారపడి ఉన్నప్పటికీ, నీటి వనరులను ముందుగానే సంరక్షించుకోవడం అత్యవసరంగా పేర్కొన్నారు..వర్షాలు తగ్గినప్పుడు తాగునీటి అవసరాలు, వ్యవసాయ సాగు, ఇతర వినియోగాల కోసం భూగర్భ జలాలపై ఆధారపడటం అందరికీ తెలిసిందే.. ఇప్పటికే భూగర్భజలాల వినియోగం అధికంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా చర్యలు చేపట్టడం, నీటి వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలని రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు..

స్నానం చెసే క్రమంలో నీటిని పొదుపు చేసే విధానాన్ని.. రవిందర్ దృశ్య రూపకం..

ఇంకుడు గుంతలుంటేనే బోర్లు వేయాలి..!

ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో, వాణిజ్య భవనాల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక ఆంక్షలు విధించి, జలవనరుల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన కోరారు.. బోర్లు వేయడానికి అనుమతులు ఇచ్చే ముందు వర్షపు నీటి సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయా లేదా అన్నది పరిశీలించాలని సూచించారు. బోరు వేసే సమయంలో బయటకు వచ్చే నీరు వృథాగా రోడ్లపైకి, డ్రైనేజీల్లోకి ప్రవహించకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేయడం వలన, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా భూగర్భజలాల పునరుద్ధరణకు కొంతమేర దోహదపడుతుందని రవీందర్ ముదిరాజ్ వివరించారు. నీటి సంరక్షణను కేవలం ప్రచార కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు..

రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలకూ నిబంధనలు ఉండాలి..!

భవన నిర్మాణాలు, ప్లాట్ల అభివృద్ధి, గృహ రుణాల మంజూరులోనూ వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని రవీందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.. ప్రతి ఒక్కరి ఇళ్ళలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలని అన్నారు.. ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్లతో పాటు బ్యాంకు రుణాలు పొందే విషయంలో, జలసంరక్షణ నిబంధనలు అంశాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రస్తావించాలని సూచించారు.. అయితే, ఇంకుడు గుంతలు లేని ప్రతి ఆస్తి రిజిస్ట్రేషన్‌ను లేదా ప్రతి బ్యాంకు రుణాన్ని తప్పనిసరిగా నిలిపివేయాలనే నిబంధన ప్రస్తుతం అమలు చేయాలని తెలిపారు.. వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత పెంచేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు..

ఎల్‌నినో ఎఫెక్ట్‌తో వీధుల్లో విద్యార్థుల ర్యాలీ దృశ్యం..

మనఇంట్లో నీటి పొదుపుతోనే.. మార్పు సాధ్యం..!

నీటి కొరతను ఎదుర్కోవడానికి పెద్దపెద్ద ప్రాజెక్టులే అవసరం లేదని.. ప్రతి కుటుంబం పాటించే చిన్నచిన్న అలవాట్లు కూడా ముఖ్యమేనని రవీందర్ ముదిరాజ్ తెలిపారు. ఇంటికి బంధువులు వచ్చినప్పుడు అవసరానికి సరిపడా నీటిని అందించడం, స్నానం చేసేటప్పుడు నీరు వృథా కాకుండా చూసుకోవడం, కుళాయిలను అవసరమైనప్పుడే వినియోగించడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు.. స్నానాల గదుల్లో నీరు వృథాగా పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరానికి మించి నీటిని వినియోగించరాదని చెప్పారు.. భోజనాల సమయంలో, ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా, సాధ్యమైనచోట పర్యావరణ హితమైన విస్తరాకులను వినియోగించడం వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించడం వ్యక్తిగత అలవాటుగా మారినప్పుడే సమాజవ్యాప్తంగా మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు..సందేశం ఒక్కటే.. ఎల్‌నినో ప్రభావాలు ఎలా ఉన్నా, నీటి వనరులను సంరక్షించుకోవడం మన చేతుల్లోనే ఉంది. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాలను కాపాడటం, నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారానే భవిష్యత్తు తరాలకు నీటి సంరక్షణా బాధ్యతను అప్పగించవచ్చని సూచించారు..

విద్యార్థులచేత ప్రతిజ్ఞ.. ప్రజలకు సందేశం..!

నార్త్ సిటీ పాఠశాల విద్యార్థులు సూరారం వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ నీటి సంరక్షణపై నినాదాలు చేశారు. ప్రతి వర్షపు బొట్టును ఒడిసిపట్టుకోవాలని, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని, నీటిని వృథా చేయకుండా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో జల సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.. భవిష్యత్తులో నీటి కొరత తీవ్రమైతే మానవ మనుగడతోపాటు వ్యవసాయం, పర్యావరణ సమతుల్యతపైనా ప్రభావం పడే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. అందుకే సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నార్త్ సిటీ పాఠశాల విద్యార్థులు, పాఠశాల డ్రైవర్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఒక అధికారి, ఇతరులు పాల్గొన్నారు

మహాపాదయాత్రపై బిగ్ ప్లాన్

హైదరాబాద్ అక్టోబరు 29, పెన్ పవర్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టేందుకు బిజెపి భారీ వ్యూహంతో ముందుకు వచ్చింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అడ్డుకోండి అనే శక్తివంతమైన నినాదంతో నవంబర్ 2న ట్యాంక్‌బండ్ వేదికగా బిజెపి మహా పాదయాత్రను చేపట్టనుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్వయంగా ఈ పాదయాత్రలో పాల్గొని తెలంగాణ రణక్షేత్రంలో బిజెపి శ్రేణులకు దిశానిర్దేశం చేయనుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా హడావుడి ప్రారంభమయింది. కాంగ్రెస్ ఓట్ చోరీ డ్రామాకు అమిత్ షా కౌంటర్ ఇచ్చేందుకు ఈ పాదయాత్ర చేపట్టారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ ఆరోపణలతో నిర్వహించనున్న ర్యాలీకి సరిగ్గా మరుసటి రోజే హైదరాబాద్ వేదికగా అమిత్ షా ఈ పాదయాత్రలో పాల్గొనడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశం. మరణించినవారు, చిరునామాలు మారినవారి వివరాల సవరణను కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని, ప్రజల్లోకి నేరుగా వెళ్లి నిజాలను వివరించేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి స్వయంగా రంగానికి దిగుతున్నారు. ఈ మహా పాదయాత్ర కేవలం ఓటర్ల జాబితా వివాదానికే పరిమితం కాకుండా, రాష్ట్రంలో రోజురోజుకూ దిగజారుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను నిలదీసేలా బిజెపి రూపకల్పన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనడం, రాజధాని హైదరాబాద్‌లోనే రోజుకు వేలాది వాటర్ ట్యాంకర్ల కోసం ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకోని రేవంత్ సర్కార్ తీరును బిజెపి ఎండగట్టనుంది. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాంగ్రెస్ నేతలు ఢిల్లీ పర్యటనలతో కాలక్షేపం చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఘాటుగా విమర్శించారు. ట్యాంక్‌బండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి బిజెపి గట్టి హెచ్చరికలు జారీ చేయనుంది. అమిత్ షా రాకతో బిజెపి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిస్తుండగా, అధికార కాంగ్రెస్ దీనిపై ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

పేద ప్రజలకు మరిన్ని సరుకులు

హైదరాబాద్, అక్టోబరు 29 పెన్ పవర్: కరవు పరిస్థితులు తలెత్తవచ్చున్న ఆందోళనల నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రేషన్ కార్డులపై పంపిణీచేస్తున్న సన్నబియ్యంతో పా టు కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్, చక్కెర, చింతపండు, కారంపొడి వంటి మరిన్ని సరుకులను అందించే ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదనసాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల అవసరాలు, సరుకుల సేకరణకు ఏర్పాట్లు, ఎంత పరిమాణంలో ఇవ్వాలి? ఎంతకాలం కొనసాగించాలి? బడ్జెట్‌పై పడే భారం వంటి అంశాలను అంచనా వేయాలని సూచించారు. ఆర్థిక, లాజిస్టిక్స్ పరమైన అంశాలు కొలిక్కి వస్తే, వచ్చే సంక్రాంతి నాటికి ఈపథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులపై సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు తలసరి 6 కిలోల చొప్పునసన్నబియ్యం అందిస్తున్నారు. ఇందుకు నెలకు 2.18 లక్షల టన్నుల బియ్యం అవసరం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 14 నెలలకు సరిపడా ఆహార ధాన్యాల బఫర్ స్టాక్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉండగా, కస్టమ్ మిల్లింగ్ రైస్, ఇతర మార్గాల ద్వారా మరో 18.39 లక్షల టన్నులు సమకూరనున్నాయి. ఈ నిల్వలు 2027 సెప్టెంబర్‌వరకు సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో రేషన్ షాపుల ద్వారా పలు రకాల నిత్యావసరాలను అందించేవారు. 2023లో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీకూడా ఇదే తరహాలో పంపిణీని విస్తరిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ దిశగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదల నుంచి ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఏయే సరుకులు ఎంత పరిమాణంలో ఇవ్వాలనే దానిపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుంది.

వడ్లకు రికార్డ్ ధర.. జై శ్రీరామ్ రికార్డ్

తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయమార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినోప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్నరకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వకొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ (రాణా) కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. మరోవైపు, ఈ ధరల పెరుగుదలప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది. "వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 'జైశ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

సామినేని రామారావు హత్య కేసులో నలుగురు అరెస్ట్

ఫోరెన్సిక్ ఆధారాలతో నిందితుల గుర్తింపు



సామినేని రామారావు గారి హత్యకు వాడిన ఆయుధాలు, దొరికిన వస్తువులు

హత్యకు గురైన సిపిఎం నేత సామినేని రామారావు

ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 29: ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్, సీపీఎం నేత సామినేని రామారావు హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. 2025 అక్టోబర్ 31న తెల్లవారుజామున 72 ఏళ్ల సామినేని రామారావు తన ఇంటి పక్కన ఉన్న కొట్టంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో ఆధారాలు సేకరించారు. బెంగళూరులో పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ నిపుణుల సహకారం తీసుకున్నారు. దర్యాప్తులో లభించిన ఆధారాలను విశ్లేషించిన అనంతరం బోడపట్ల శ్రీనివాసరావు, నూకల లింగయ్య, మల్లారపు లక్ష్మయ్య, కార్లపూడి ఉదయ్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కత్తులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వైరా ఏసీపీ ఎస్. సారంగపాణి పర్యవేక్షణలో, సీఐ వై. వెంకట ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐలు వీరేందర్, జి. నరేష్ తదితరులు దర్యాప్తులో పాల్గొన్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులను కమిషనర్ సునీల్ దత్ అభినందించి రివార్డులు అందజేశారు

తెలంగాణ మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

సీపీఐ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్ పెన్ పవర్: ఎల్ నినో పేరుతో కరువు విలయ తాండవం చేస్తోంది . రాజకీయంగా ఒకరిపైనన ఒకరూ బురద జల్లుకోవడం మానేసి దీని నుంచి ఎట్లా బయటపడాలో ఆలోచించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కరువు అనేది ప్రపంచ వ్యాప్తంగా సంభవించింది. కరువును కొన్ని మండలాలకే పరిమితం చేయకూడదు. తెలంగాణ మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి. బియ్యం ధర, నీళ్ల ట్యాంకర్ ధరలు ఇప్పుడే పెరిగిపోయాయి.

ఎక్కడైనా అక్రమంగా నిల్వ చేస్తే సీపీఐ కరువు దాడులు చేస్తోందని హెచ్చరించారు.

పేద ప్రజలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తుంది . జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేలా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి. కరువు పరిస్థితిని పరిశీలించేందుకు నవంబర్ 3, 4 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తాం. బ్రెజిల్ లో కమ్యూనిస్టులు మళ్లీ గెలిచారు . ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టులు గెలుస్తున్నారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో

కాంగ్రెస్ తొండిగా వ్యవహరించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు కోరాయి. సీపీఐ నుంచి కూడా పోటీ చేయాలనే ఆలోచన ఉంది . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ తర్వాత పోటీ చేయాలా వద్దా అనేది తెలుస్తుందని అన్నారు

ప్రధానమంత్రి దీపావళి కానుక పేరుతో కొత్తరకం మోసం

-3 పేజి తరువాయి

ప్రచారం చేస్తున్నారు. అనుమానాస్పద వెబ్‌సైట్ లింక్‌లపై క్లిక్ చేయాలని సందేశాలు పంపుతున్నారు. నకిలీ లింక్‌ల ద్వారా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. UPI ద్వారా అక్రమ లావాదేవీలు, మొబైల్‌లో హానికరమైన సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రూ. 8,000 నగదు ప్రయోజనంపై వచ్చే సందేశాలను నమ్మొద్దు.. లింక్‌లపై క్లిక్ చేయొద్దని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) హెచ్చరికలు జారీ చేసింది. OTP\T, UPI PIN\T, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను, ధ్రువీకరించని సందేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు షేర్ చేయొద్దని సూచించింది. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్, ఒుఒు.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅలో ఫిర్యాదు చేయాలని తెలిపింది.

ఎర్రవల్లిలో 45 ఎకరాలు

మెదక్, అక్టోబరు 29 పెన్ పవర్: కేసీఆర్ ఫాంహౌస్ పరిసర ప్రాంతాల చుట్టూ మరోసారి రాజకీయ రగడ మొదలైంది. సిద్ధిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ శివార్లలోని సర్వే నంబర్ 325 చుట్టూ ఇప్పుడు చర్చ నడుస్తోంది. రికార్డుల్లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. సర్వేలో 343 ఎకరాలు మాత్రమే బయటపడింది. దీంతో 45 ఎకరాలు మిస్ అయినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పుడీ అంశం రాజకీయాల్లోకీలకంగా మారింది. ఈ భూమి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ఆనుకుని ఉంది. దీంతో దీనిపై ఉత్కంఠ నెలకొంది. కేసీఆర్ ఫాంహౌస్ లో ఆక్రమిత భూమి ఉందంటూ సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. అంతేకాక, ఈ అంశంపై రెవిన్యూ అధికారులు సర్వే నిర్వహించాలని ఆదేశించారు. దీంతో అధికారులు సర్వే చేశారు. మొదటి దశ సర్వేలో రైతుల కబ్జాలోని భూములు, హద్దులు గుర్తించిన తర్వాత రీసర్వే చేపట్టారు. అధికారులు ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానికుల్లోనూ, రాజకీయవర్గాల్లోనూ చర్చ మొదలైంది. కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములు ఈ సర్వే నంబర్‌కు ఆనుకుని ఉన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. దీంతో వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెళ్లాయి. అయితే ఇప్పటివరకు ఫామ్‌హౌస్‌లోకి అధికారులు వెళ్లలేదు. నోటీసులు కూడా అందించలేదు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములను ఆక్రమించారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. వాటిని స్వాధీనంచేసుకుని అర్హులైన రైతులకు, దళిత కుటుంబాలకు పంపిణీ చేస్తామని, అలాగే తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే కాంగ్రెస్‌ప్రభుత్వం అనవసరంగా రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ జరిగిన అభివృద్ధి, నీటి వనరులు, సరిహద్దు మార్పులపై ప్రశ్నలు లేవనెత్తడం ద్వారా ప్రతిపక్షాన్ని ఒత్తిడికి గురిచేస్తున్నారని వారి వాదన. మరోవైపు శివారు వెంకటాపూర్ గ్రామస్తులు తమ భూములు ఎర్రవల్లిలో కలిపేశారని ఆందోళన చెందుతున్నారు. సరిహద్దుల నిర్ధారణకోసం ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. రైతులు రెవెన్యూ మంత్రిని కలిసి పిటిషన్‌లు ఇవ్వడంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. ధరణి పోర్టల్‌లోని రికార్డుల వైరుధ్యాలు, గత పాలనలో జరిగిన సర్వేలపైనాప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణలో భూ సమస్యలు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ ఆస్తుల రక్షణ అనే అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం క్లీన్ ఇమేజ్‌ను నిర్మించుకోవాలని చూస్తోంది. అదే సమయంలోబీఆర్ఎస్‌ను భూదోపిడీదారుగా చిత్రీకరించేందుకు స్కెచ్ వేసింది. కేసీఆర్ ప్రస్తుతం ఫామ్‌హౌస్‌లోనే ఎక్కువ సమయం గడుపుతున్న నేపథ్యంలో ఈ సర్వే ఆయనపై నిరంతర ఒత్తిడి సృష్టిస్తోంది. అయితేన్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యే వరకు నిర్ధారణలు చేయడం సరికాదు. రీసర్వే ఫలితాలు, నోటీసులకు వచ్చే సమాధానాలు, సరిహద్దు నిర్ధారణలు ఎలా ఉంటాయో చూడాలి. ఈ 45 ఎకరాలు నిజంగాఎక్కడ ఉన్నాయి? ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందా లేక రికార్డుల లోపమా? అనే ప్రశ్నలకు సమాధానం వచ్చే వరకు ఎర్రవల్లిపై ఉత్కంఠ కొనసాగనుంది.

ఈఎస్ఐ హౌస్ కీపింగ్‌లో ఏం జరుగుతోంది?

హైదరాబాద్, అక్టోబరు 29 పెన్ పవర్: తెలంగాణలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల ఖర్చు భారీగా పెరిగింది. ఈ సేవలకు చెల్లించే చార్జీలను ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) అధికారులు భారీగాపెంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024లో చదరపు అడుగుకు రూ. 10గా ఉన్న చార్జీని 2025లో రూ. 25కు, తాజాగా రూ. 49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువచెల్లింపులకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. దీంతో గతేడాదితో పోలిస్తే 2026లో ఈ సేవలపై దాదాపు రూ. 50 కోట్ల అదనపు భారం పడుతోంది. టెండర్లు నిర్వహించకుండా నామినేషన్ పద్ధతిలోకాంట్రాక్టులు అప్పగించడంపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అద్దె కంటే తొమ్మిది రెట్లు ఎక్కువ ఖర్చు ఖైరతాబాద్‌లో 3,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దెభవనంలో కొనసాగుతోంది. చదరపు అడుగుకు రూ. 15 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ చదరపు అడుగుకు రూ. 10 అద్దె చెల్లించాలని నిర్ణయించినప్పటికీ, భవనాలలభ్యత, డిమాండ్‌ను బట్టి యజమానితో చర్చించి అద్దెను ఖరారు చేశారు. దీంతో ప్రభుత్వం నెలకు దాదాపు రూ. 45,900 చెల్లిస్తోంది. కేన్సర్ చికిత్సలో కొత్త ప్రయోగాలు అయితే, ఇదే భవనంలో హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ సేవల కోసం నెలకు దాదాపు రూ. 4.15 లక్షలు ఖర్చు చేస్తుండటం గమనార్హం. భవనం అద్దెతో పోలిస్తే ఈ వ్యయం తొమ్మిది రెట్లు ఎక్కువ. హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకురూ. 70.49, సెక్యూరిటీ సేవలకు రూ. 65.17 చొప్పున చెల్లిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఇతర డిస్పెన్సరీల్లోనూ ఇదే తరహాలో అధిక వ్యయం చేస్తున్నట్లు ఐఎంఎస్‌లెక్కలు సూచిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతీయ ఈఎస్ఐ ఆస్పత్రులు, రెండు డయాగ్నొస్టిక్ కేంద్రాలు, 71 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో 53 డిస్పెన్సరీలు హైదరాబాద్ రీజియన్ పరిధిలో, 18 వరంగల్ రీజియన్ పరిధిలో ఉన్నాయి. రాష్ట్రంలో 21 లక్షల మంది ఈఎస్ఐ చందాదారులు ఉండగా, వారి కుటుంబసభ్యులతో కలిపి 90 లక్షల నుంచి కోటి మంది వరకు వైద్య సేవలుపొందుతున్నారు చార్జీలు పెరిగినా ఉద్యోగులకు అందని ప్రయోజనం ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల బాధ్యతలను ఐఎంఎస్ డైరెక్టరేట్ పర్యవేక్షిస్తోంది. కాంట్రాక్టర్ల ఎంపిక, ధరల నిర్ణయం, బిల్లుల చెల్లింపులు ఈ విభాగం పరిధిలోనే జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,78,455 చదరపు అడుగుల విస్తీర్ణానికి ఈ సేవలు అందించాల్సి ఉంది. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల చార్జీని చదరపు అడుగుకు రూ. 49.50కు పెంచుతూ ఐఎంఎస్ డైరెక్టర్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ధరలకు జీఎస్టీ అదనం. 2028 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఈధరలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ. 70.15 వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఖైరతాబాద్‌లో ఈ మొత్తంరూ. 70.49గా ఉంది 2020 నుంచి చదరపు అడుగుకు రూ. 10 చొప్పునే చెల్లిస్తున్నారంటూ సీఎం ప్రజావాణికి పలువురు వినతులు సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సంస్థలు చార్జీలుపెంచాలని కోరడంతో 2025 మేలో చదరపు అడుగుకు రూ. 25 చెల్లించేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. తాజాగా ఈ మొత్తాన్ని రూ. 49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువచెల్లించేందుకు కూడా అనుమతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, చార్జీలు పెరిగినా ఉద్యోగులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సిబ్బందికి నెలకు రూ. 12 వేల నుంచి రూ. 15 వేల మధ్యే వేతనాలు చెల్లిస్తున్నారు. చార్జీల పెంపుతో ఉద్యోగులకు కనీసం రూ. 35 వేలకు పైగా వేతనం అందాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రయోజనంకాంట్రాక్టర్లకే దక్కుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, ఉద్యోగులకు సంబంధించిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిధులు నెలల తరబడి జమ కావడం లేదని సమాచారం. ఈ సమస్యపై నాచారం ప్రాంతీయఆస్పత్రిలో ఉద్యోగులు గత వారం మూడు వారాల పాటు నిరసనలు, ఆందోళనలు చేపట్టినట్లు కథనంలో పేర్కొన్నారు. నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టుల అప్పగింత ప్రభుత్వ శాఖల్లో రూ. 5 లక్షలు దాటినపనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేయాల్సి ఉంటుందని కథనం పేర్కొంది. అయితే, ఐఎంఎస్‌లో కోట్ల రూపాయల విలువైన హౌస్ కీపింగ్, సెక్యూరిటీ పనులను టెండర్లు లేకుండానే నామినేషన్ పద్ధతిలో కొన్ని సంస్థలకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. చార్జీల పెంపు, కాంట్రాక్టర్ల ఎంపిక, బిల్లుల చెల్లింపుల వెనుక ముడుపుల వ్యవహారం ఉందంటూ కార్మిక వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఐఎంఎస్ డైరెక్టరేట్‌లోని ఓ జాయింట్ డైరెక్టర్ ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. 2024లో ఈ సేవల కోసం రూ. 10.50 కోట్లు ఖర్చు చేయగా, గతేడాదిరూ. 26.35 కోట్లు వ్యయమైంది. 2028 ఆర్థిక సంవత్సరానికి ఈ ఖర్చు రూ. 78.5 కోట్లకు పైగా చేరినట్లు కథనంలో పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దాదాపు రూ. 50 కోట్ల అదనపు వ్యయంనమోదవడంపై కార్మికులు, ఉద్యోగులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. చార్జీల పెంపు, టెండర్లు లేకుండా కాంట్రాక్టుల అప్పగింతపై కొందరు ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

ఒక్క అనిరుధ్‌కే కాదు.. ఏ ఎమ్మెల్యేకూ నిధులివ్వలేని పరిస్థితి.. మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ పెన్ పవర్: ఓవైపు పైసల్లేవు.. ఆర్థిక సంక్షోభం.. పథకాలు భారమవుతున్నాయి.. పాలన సాగించడానికే ఆపసోపాలు.. ఇచ్చిన హామీల అమలు ఇంకా పెండింగ్ ఉంది. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు ఇప్పుడు నిధుల కొరత వేధిస్తోంది. ఇలాంటి సమయంలో సొంత కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే నిధులు సర్దలేని పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలోనే ఒక్కో ఎమ్మెల్యే స్వరం పెచ్చరిల్లుతుండగా.. సర్దుబాటు చేయలేని కాంగ్రెస్ అధిష్టానం.. వారిపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమవ్వడం హాట్ టాపిక్ గా మారింది. నిధులు లేకపోవడం.. సర్దుబాటు చేయకపోవడం కాంగ్రెస్ సర్కార్ తప్పు. ఆ తప్పు ప్రశ్నించిన వారిపై చర్యలు అంటే అధిష్టానం ఆలోచించాల్సిన విషయం. రేపు అందరు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తే ఎంత మందిపై వేటు వేస్తారన్నది ప్రశ్న.తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో నిధుల విడుదల, అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల అంశం తీవ్ర రాజకీయ కలకలం రేపుతోంది. జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇటీవల చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీలోనూ.. ప్రభుత్వంలోనూ పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల లభ్యతపై ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం పట్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) తీవ్రంగా పరిగణించింది.

చావడానికైనా సిద్ధమే.. అనిరుధ్ రెడ్డి ఆవేదన

తన నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే చెల్లించాలంటూ అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. “నా నియోజకవర్గంలో పనుల బిల్లులు రావాలంటే నేను చనిపోవాల్సిందేనా? నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైతే చావడానికైనా సిద్ధమే” అని ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ప్రజాప్రతినిధిగా ఉంటూనే స్వపక్ష ప్రభుత్వ తీరుపై ఈ స్థాయిలో నిరసన తెలపడం కాంగ్రెస్ లో చిచ్చురాజేసింది.

క్రమశిక్షణ చర్యలు తప్పవు : టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

ఎమ్మెల్యే అనిరుధ్ వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. నిధుల కొరత అనేది ఒక్క జడ్చర్ల నియోజకవర్గానికే పరిమితం కాలేదని.. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇదే తరహా ఆర్థిక పరిస్థితులు ఉన్నాయని స్పష్టం చేశారు. పార్టీ పరిధిలో మాట్లాడాల్సిన అంశాలను రచ్చకెక్కించడం సరికాదని హితవు పలికారు. ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీకి అప్పగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. క్రమశిక్షణ కమిటీ పరిశీలన అనంతరం అనిరుధ్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందనే వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి.

కేంద్రంపై ధ్వజమెత్తిన మహేశ్ కుమార్ గౌడ్

ఇదే సందర్భంలో జాతీయ రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ తీరుపై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లో బీజేపీని ఓడించడమే కాంగ్రెస్ సాధించిన అతిపెద్ద రాజకీయ విజయమని వ్యాఖ్యానించారు. మోదీ మీడియా సమావేశాలు పెట్టకుండా కేవలం సోషల్ మీడియా పోస్టులకే పరిమితమవుతున్నారని విమర్శించారు.

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీకి తెలంగాణ నుంచి కార్యకర్తలను తరలించేందుకు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను కేటాయించడం లేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి బీజేపీ భయపడుతోందని.. అందుకే అడ్డంకులు సృష్టిస్తోందని ఆక్షేపించారు.

కాంగ్రెస్‌కు సవాలుగా మారిన అంతర్గత అసంతృప్తి

ఒకవైపు ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల బిల్లులు రాక నిరసనలు వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు పార్టీ క్రమశిక్షణ పేరిట చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో ఆసక్తికరంగా మారింది. ఈ వివాదం కేవలం అనిరుధ్ రెడ్డి నోటీసులకే పరిమితమవుతుందా లేక రాష్ట్రవ్యాప్తంగా నిధుల కొరతపై పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తుందా అనేది వేచి చూడాల్సిందే.

నిరుద్యోగ యువతకు బీఎంఆర్ ఫౌండేషన్ అండ..

250 మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

హైదరాబాద్ పెన్ పవర్: ల్లా తాండూరులో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తోంది బీఎంఆర్ ఫౌండేషన్. పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న సుమారు 250 మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.తాండూరులోని విలియం మూన్ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రాతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్టడీ మెటీరియల్ అందజేశారు.ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువత, పేద కుటుంబాలకు బీఎంఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. అభ్యర్థులు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ లక్ష్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్థిక పరిస్థితులు భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదని, పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు.అభ్యర్థులకు మెరుగైన శిక్షణ అందించడంతో పాటు, ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఫిజికల్ టెస్టులు, తుది పరీక్షకు కూడా శిక్షణ అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతో బీఎంఆర్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

నవంబరు 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఛట్ పూజోత్సవాలు

హైదరాబాద్ పెన్ పవర్: ఉత్తర భారతీయులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజోత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసేందుకు జీవో విడుదల చేయడంపై జన్ సేవా సంఘ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో నవంబరు 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఛట్ పూజోత్సవాలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు బిశ్వదీప్ సింగ్ వెల్లడించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పూజోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నెక్లెస్ రోడ్, సంజీవయ్య పార్కుతో పాటు మొత్తం 30 ఘాట్‌లలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు 13, 14 తేదీల్లో భక్తులు ఉపవాస దీక్షలు చేపడతారని, 15న సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో నీటిలో నిలబడి సూర్యభగవానుడికి పూజలు చేస్తారని వివరించారు. 16న తెల్లవారుజామున 5 గంటల నుంచే సూర్యోదయ పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ వేడుకలకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. సుమారు లక్ష మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతూ సూర్యభగవానుడిని ఆరాధించడం ఛట్ పూజ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఉత్తర భారతదేశంతో పాటు నేపాల్‌లోనూ ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం నవంబరు 15, 16 తేదీలను రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించాలని బిశ్వదీప్ సింగ్ కోరారు.

సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు

చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి ఎంఈఓ శ్రీనివాస్

ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 29: ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి ఆత్మవిశ్వాసం ఐకమత్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి (ఎంఈఓ) శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని అలవర్చుతాయని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు ఉంటాయని అన్నారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు. క్రీడా పోటీల నిర్వహణ పట్ల పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రశాంతి, పీఈటీ రామారావు, కృష్ణ, భాస్కర్, విజి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సారీలు చెప్పేవారు ఇంకా క్యూలో ఉన్నారు.. కొండా సురేఖ క్షమాపణలపై కేటీఆర్ స్పందన

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన వ్యక్తిగత ఆరోపణల వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. తనపై గతంలో చేసిన వ్యక్తిగత విమర్శలను ఉపసంహరించుకుంటున్నట్లు కాంగ్రెస్ నాయకురాలు, మాజీ మంత్రి కొండా సురేఖ ప్రకటించడం రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరింత ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

నిజం నిలకడ మీద తేలుతుంది : కేటీఆర్

కొండా సురేఖ క్షమాపణలపై కేటీఆర్ స్పందిస్తూ.. “నిజం నిలకడ మీద తేలుతుంది” అని వ్యాఖ్యానించారు. తమపై రాజకీయ దురుద్దేశంతో చేసిన తప్పుడు ఆరోపణలు ఒక్కొక్కటిగా దూది పింజల్లా తేలిపోతున్నాయని అన్నారు. “మొన్న ఒక ప్రముఖ వార్తాపత్రిక క్షమాపణలు చెప్పింది.. నేడు ఈ మేడం (కొండా సురేఖ) తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు.. రేపు మరెందరో ఈ దారిలోనే రాక తప్పదు. సారీ చెప్పేవాళ్లు ఇంకా చాలామంది క్యూలో ఉన్నారు” అని ధీమా వ్యక్తం చేశారు. తమను రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా కొందరు నిరాధారమైన వ్యాఖ్యలు చేశారని.. కాలక్రమేణా నిజాయితీ గెలుస్తుందనడానికి ఈ పరిణామాలే నిదర్శనమని స్పష్టం చేశారు. “మొన్న పేపర్.. నేడు మేడం.. రేపు మరెందరో! తమపై తప్పుడు ఆరోపణలు చేసినవారు భవిష్యత్తులోనూ క్షమాపణలు చెప్పక తప్పదు.” అంటూ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

న్యాయపరమైన చర్యలపై త్వరలోనే నిర్ణయం

కొండా సురేఖ సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రకటనను తాను ఇంకా పూర్తిగా పరిశీలించలేదని కేటీఆర్ వెల్లడించారు. ఆమె ట్వీట్‌లో ఏం పేర్కొన్నారో సమగ్రంగా పరిశీలించిన తర్వాత తన న్యాయవాదుల బృందంతో చర్చించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాతే లీగల్ చర్యలపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ వివాదానికి కొండా సురేఖ ప్రకటనతో ఇక్కడితోనే ముగింపు పడుతుందా లేక న్యాయస్థానాల్లో ప్రక్రియ కొనసాగుతుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

అసలు కొండా సురేఖ ట్వీట్‌లో ఏముంది?

అంతకుముందు కేటీఆర్‌ను ఉద్దేశించి కొండా సురేఖ సోషల్ మీడియాలో ఒక వివరణ ఇచ్చారు.. రాజకీయ విమర్శలు చేసే క్రమంలో కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని అంగీకరించారు. కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ వ్యక్తిగతంగా బాధపెట్టాలనే దురుద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. తన మాటల వల్ల కేటీఆర్ లేదా ఆయన కుటుంబం మనస్తాపానికి గురై ఉంటే చింతిస్తున్నట్లు చెబుతూ ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు.

వేడెక్కిన తెలంగాణ రాజకీయం

కొండా సురేఖ క్షమాపణల ప్రకటన ఒకవైపు వివాదానికి తెరదించేలా కనిపిస్తున్నప్పటికీ కేటీఆర్ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. రాజకీయ విమర్శలకు, వ్యక్తిగత ఆరోపణలకు మధ్య ఉండాల్సిన హద్దులు అవసరమంటూ కేటీఆర్ వ్యాఖ్యనించడం చర్చనీయాంశమైంది. కేటీఆర్ ప్రస్తావించిన “క్యూలో ఉన్నవారు ఎవరు?” అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో మరికొందరు నేతలు కూడా క్షమాపణలు చెప్పే పరిస్థితి వస్తుంది అన్న కేటీఆర్ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి అన్నారన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

మొన్న నాగార్జున.. నేడు కేటీఆర్ పై.. కొండా సురేఖకు సడెన్ గా ఏమైంది?

హైదరాబాద్ పెన్ పవర్: అధికారాంతమున అన్నీ అర్థమవుతాయంటారు.. తప్పులు అందరూ చేస్తారు.. కానీ అవి సరిదిద్దుకునేందుకు అవకాశం చాలా లేటవుతుంది. అప్పటికీ చేసుకుందామన్నా.. సమయం.. జరగాల్సిన నష్టం జరిగిపోతుంటుంది.. తెలంగాణ మంత్రిగా కొండా సురేఖకు గతంలో దక్కిన గౌరవం.. పరపతి.. రేవంత్ వద్ద బీసీ మహిళా మంత్రిగా కీర్తి అన్నీ ఇన్నీ కావు. అయితే ఒక్క తప్పు.. అదీ ఆమె చేసింది కాదు.. అయినా ఆమె పదవికి ముప్పుతెచ్చింది. కూతురు తప్పును సరిదిద్దక.. వెనకేసుకు రావడం మంత్రి సురేఖ పదవికి ఎసరు తెచ్చింది..సురేఖ మొదటి నుంచి ఒక ఫైర్ బ్రాండ్.. తెలంగాణలో ఆమె మాట్లాడితే ప్రత్యర్థులందరూ వణకాల్సిందే. అంతలా వాగ్ధాటి ఆమె సొంతం. అయితే ముందునుంచి ఆ మాటల మంత్రమే ఆమెను తెలంగాణలో ఒక ఫైర్ నేతగా మార్చింది. రాజకీయ నేతగా నిలబెట్టింది.నాడు వైఎస్ఆర్ కు అండగా కాంగ్రెస్ లో వెలిగిన ఆమె.. అనంతరం ఆమె కుమారుడు జగన్ కు అండగా నిలిచి తెలంగాణలో తీవ్ర వ్యతిరేకత తెచ్చుకున్నారు. అన్న మాట కోసం జగన్ వెంట నడిచి రాళ్లు వేయించుకున్నా వెనక్కి తగ్గలేదు.ఇక రాష్ట్రం విడిపోయాక బీఆర్ఎస్ లో ఫైర్ బ్రాండ్ గా మారి.. అదే దుందుడుకు తనంతో బయటకెళ్లిపోయారు.

కాంగ్రెస్ లో చేరి మంత్రి పదవి సంపాదించి ఇక్కడ కూడా అదే స్వభావంతో కష్టాలు కొని తెచ్చుకున్నారు. ఈసారి ఆమె పదవికి చేతు తెచ్చింది మాత్రం ఆమె కూతురు వల్ల.. సీఎం రేవంత్ పై ఆమె కూతురు చేసిన తీవ్ర వ్యాఖ్యలు.. అధిష్టానం ఆగ్రహానికి గురై చివరకు సురేఖ మంత్రి పదవి పోయేలా చేశాయి.అధికారంలో మంత్రిగా ఉన్నప్పుడు సురేఖ గతంలో హీరో నాగార్జునపై, అక్కినేని కుటుంబంపై ‘సమంత–నాగచైతన్య’ విడాకుల విషయంలో చేసిన కామెంట్స్ దుమారం రేపాయి. అది కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టాయి. చివరకు నాగార్జునకు, అక్కినేని కుటుంబానికి సారీ చెప్పినా.. ఆమె మాటల వేడి తగ్గలేదు. కోర్టు కేసుల వరకూ వెళ్లాయి..తర్వాత కాలంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి మాట్లాడిన మాటలు దుమారం రేపాయి. ఆయన కోర్టుకెళ్లారు. కాంగ్రెస్ మంత్రిగా ఆమె చేసిన మాటలు జాతీయ స్థాయి వరకూ వెళ్లి అప్రతిష్ట పాలు చేశాయి. రెండూ వివాదాల్లోనూ సురేఖ హద్దులు దాటేసింది. ఇప్పుడు మంత్రి పదవి పోయాక చాలా రోజులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై చేసిన వ్యక్తిగత కామెంట్లకు కొండా సురేఖ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. కొండా సురేఖ తాజాగా ట్వీట్ చేస్తూ.. “బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్ పై గతంలో నేను చేసిన కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల వివరణ ఇవ్వాలని అనుకుంటున్నాను. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ విధంగా మాట్లాడానే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఆనాడు నేను చేసిన కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండవలసింది. కేటీఆర్ గారిని లేదా ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ వారి ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశం గాని నాకు ఎంతమాత్రం లేవు. నా వ్యాఖ్యలు వారిని గానీ.. వారి కుటుంబ సభ్యులను గానీ నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నాను ” అంటూ బాధపడ్డారు.

కొండా సురేఖ వ్యాఖ్యలతో చేసిన డ్యామేజ్ అంతా ఇంతాకాదు.. ఈ పశ్చాత్తాపం అప్పుడు మంత్రిగా పడి ఉంటే సానుభూతి దక్కేదని విశ్లేషఖులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు పూర్తి డ్యామేజ్ జరిగి మంత్రి పదవి పోయి.. అప్రతిష్ట పాలై.. కాంగ్రెస్ నుంచి బయటకు వెళదామన్నా.. తెలంగాణలోని బీఆర్ఎస్, బీజేపీల్లో దారులు మూసుకుపోయిన తరుణంలో కొండా సురేఖ చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు పశ్చాత్తాపడ్డ జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

నేతలుగా రాజకీయాల్లో ఉన్నప్పుడు ఎలా వ్యవహరించాలి.. ఎంత జాగ్రత్తగా లేకపోతే కెరీర్ కు ఎంత ప్రమాదమన్నది కాలమే సమాధానం చెప్తుంది. అందుకే కొన్ని విషయాల్లో నేతలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు నొక్కి చెబుతున్నాయి.

పొత్తులపై చంద్రబాబు సంచలన నిర్ణయం.. అలా చేస్తే సస్పెన్షనే!

విజయవాడ, అక్టోబరు 29 పెన్ పవర్: స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీల మధ్య పొత్తు ధర్మం కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమిలోని పక్షాలన్నీ కలిసికట్టుగా ముందుకు సాగాలని, అభ్యర్థుల గెలుపు కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎక్కడైనా రెబల్స్ బరిలో ఉంటే వెంటనే సస్పెండ్ చేయాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. మూడు పార్టీల కలిసి నిలబెట్టిన వారే కూటమి అభ్యర్థి అంటూ సీఎం స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా పోటీ చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. రాష్ట్రమంత్రి వర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో మంత్రులు తాజా రాజకీయాలపై చర్చించారు. ప్రస్తుతం మున్సిపల్, జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల ప్రచార పర్వం ఎలా సాగుతుందో అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇంచార్జి మంత్రులు ఆయా జిల్లాల్లో కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా స్థానిక ఎన్నికలలో రెబల్స్ అంశంపై సీఎం, మంత్రులు కూలంకుషంగా చర్చించారు. డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తో కలిసి సీట్ల సర్దుబాటు చేసుకున్నామని సీఎం గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను చూసి కాకుండా, ఎన్డీఏ కూటమిని చూసి ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అత్యంత సానుకూల వాతావరణం ఉందని కేబినెట్ అభిప్రాయపడింది.

రెబల్స్ దారిలోకి వస్తారా?

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రెబల్స్ దారిలోకి వస్తారా? అనే చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం రేపటితో ముగియనుండగా, 1వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా జడ్పీటీసీ, ఎంపీటీసీలకు నామినేషన్ ఉపసంహరణ గడువు ఇప్పటికే పూర్తయింది.



దీంతో పలుచోట్ల కూటమి సర్దుబాట్లను లెక్కచేయకుండా టీడీపీ నేతలు పోటీ చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే మిత్రపక్షాలకు తక్కువ సీట్లు ఇచ్చారనే అసంతృప్తి నడుమ పార్టీ నేతలు తిరుగుబాటు చేయడంపై సీఎం సీరియస్ గా ఉన్నారని అంటున్నారు. రెబల్స్ విషయంలో మెతక వైఖరి ప్రదర్శిస్తే మిత్రపక్షాలు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉన్నందున మాట వినని వారిపై వేటు వేయాలని సీఎం స్పష్టమైన వైఖరి తీసుకున్నారని అంటున్నారు. ఇప్పటివరకు ఉన్న చిన్న చిన్న వివాదాలను ఎక్కడికక్కడ పరిష్కరించుకోవాలని చివరి అవకాశం ఇవ్వాలని, లేదంటే సస్పెండ్ చేయాలని తెగేసి చెప్పారని చెబుతున్నారు.

మంత్రులకు ఎన్నికల బాధ్యతలు

ఇక మంత్రులు తమ సొంత నియోజకవర్గాలతో పాటు, ఇంచార్జి బాధ్యతలు చూస్తున్న జిల్లాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. "అభ్యర్థుల గెలుపు బాధ్యత పూర్తిగా మంత్రులదే" అని స్పష్టం చేశారు. ముందుగా పట్టణ స్థానిక సంస్థలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పూర్తవుతాయని, ఆ వెంటనే పంచాయతీ ఎన్నికలు, ఆ తర్వాత సొసైటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పట్నుంచే నాయకులు, కేడర్ అన్నింటికీ తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత పూర్తిస్థాయి పాలనపై దృష్టి సారిద్దామని కేబినెట్ సమావేశంలో పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. జనసేన, బీజేపీ నుంచి తలెత్తిన చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ప్రజలు, కేడర్ నుంచి మంచి సానుకూల స్పందన వస్తోందని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఎన్డీఏ కూటమి సమన్వయంతో ముందుకు వెళ్తున్న తరుణంలో, రెబల్స్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని తీసుకున్న నిర్ణయం ద్వారా కూటమిలో క్రమశిక్షణ మరింత బలపడుతుందని నేతలు భావిస్తున్నారు.

ఓటుకు రూ.3 వేలు.. బొత్స వర్సెస్ కిమిడి పోరు, ఓటర్లకు గరిష్ట ధర!

విజయవాడ, అక్టోబరు 29 పెన్ పవర్: విజయనగరం జిల్లా చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికలు రాజకీయ సెగలు పుట్టిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలోని గరివిడి మండల జడ్పీటీసీ స్థానానికి సీనియర్ నేతలు కిమిడి కళావెంకటరావు, బొత్స సత్యనారాయణ కోడళ్లు పోటీ పడుతున్నారు. దీంతో గరివిడి జడ్పీటీసీ ఎన్నిక ఇరువురు నేతలకు ప్రతిష్టాత్మకంగా మారిందని అంటున్నారు. కళావెంకటరావు ప్రస్తుతం చీపురుపల్లి ఎమ్మెల్యేగా ఉండగా, బొత్స ఇదే నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా పనిచేశారు.

గత ఎన్నికల్లో బొత్సను ఓడించిన కళావెంకటరావు వ్యూహాలు రచిస్తున్నారని చెబుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలు ఉండగా, ఇందులో రెండు చోట్ల బొత్స కుటుంబం నుంచి కోడలు పూజిత (గరివిడి), చెల్లెలు వెంకటలక్ష్మి (గుర్ల) పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరిలో బొత్స కోడలు పూజిత గెలుపు ఆయనకు వ్యక్తిగతంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిందని అంటున్నారు. దీనికి ప్రధాన కారణం సిట్టింగ్ ఎమ్మెల్యే కళావెంకటరావు కోడలు సంధ్య పోటీ ఉండటమే అంటున్నారు. గరివిడి మండలం తొలి నుంచి టీడీపీకి కంచుకోటగా చెబుతున్నారు. అయితే ఇక్కడ బొత్స వ్యక్తిగత ఇమేజ్ కూడా ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని అంటున్నారు. గత ఎన్నికల్లో బొత్సపై చీపురుపల్లిని సుస్థిరం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో కోడలిని జడ్పీటీసీగా బరిలో దింపి జడ్పీ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో బొత్స కూడా గత ఎన్నికల్లో ఎదురైన పరాభవానికి సమాధానంగా నియోజకవర్గంలోని నాలుగు స్థానాలు గెలుచుకునే లక్ష్యంతో పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరువురు నేతలు వ్యక్తిగత ప్రతిష్టకు తీసుకుని విజయం కోసం గెలిచిన ఎమ్మెల్యే కళావెంకటరావు తన గెలుపు గాలివాటం కాదని నిరూపించుకోవాలని భావిస్తున్నారని చెబుతున్నారు. తన సొంత నియోజకవర్గమైన రాజాం ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఉండటం వల్ల తన కుటుంబ రాజకీయ భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం అన్న ఆలోచనలో కళా ఉన్నారని అంటున్నారు. ఇక బొత్స కూడా ఇంచుమించు ఇదే ఆలోచనతో స్థానిక ఎన్నికలపై గట్టిగా ఫోకస్ చేశారని చెబుతున్నారు. గత ఎన్నికల్లో అనూహ్య ఓటమితో డీలా పడిన బొత్స.. ఈ ఎన్నికల ద్వారా తిరిగి పుంజుకోవాలని, చీపురుపల్లి తన కంచుకోటగా నిరూపించుకోవాలని తాపత్రయ పడుతున్నారని చెబుతున్నారు. దీంతో ఇద్దరు సీనియర్ నేతలు ఎత్తుకుపైఎత్తులు వేస్తుండటంతో గరివిడి జడ్పీటీసీ ఎన్నిక హీట్ పుట్టిస్తోందని అంటున్నారు. ఇరువురు నేతలు గెలుపు కోసం ఎంతవరకు అయినా వెళ్లేలా కనిపిస్తుండటంతో ఓటర్లకు మంచి కానుకలు అందుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న ప్రచారం ప్రకారం ఒక్కో ఓటుకు మూడు వేల రూపాయలు అయినా చెల్లించేందుకు ఆయా పార్టీలు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. గ్రామాలకు గ్రామాలను కొనేసి ఎన్నికను ఏకపక్షం చేసుకోవాలనే ఆలోచనతో నాయకులు ఉన్నారని అంటున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో ఇంతకు ముందు ఎన్నడూ లేనట్లు ప్రస్తుతం ఓటుకు గరిష్ట రేటు పలుకుతోందని చెబుతున్నారు.

ఏబీవీ ఎఫెక్ట్ ఎంత? : సోషల్ మీడియాలోనే కనిపిస్తున్న హడావుడి

విజయవాడ, అక్టోబరు 29 పెన్ పవర్: రాష్ట్రంలో అత్యంత రాజకీయ ప్రాధాన్యం ఉన్న విజయవాడ నగర పాలక సంస్థ ఎన్నికలు ఆసక్తి రేపుతున్నాయి. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఇండిపెండెంటుగా పోటీలోకి దిగడంతో నగర రాజకీయమే మారిపోయిందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఆయనకు మద్దతుగా విద్యావంతులు, రిటైర్డ్ ఐఏఎస్, పోలీసు అధికారులు గళం వినిపిస్తున్నారు. ఇదే సమయంలో ఏబీవీ సైతం సోషల్ మీడియా వేదికగా జోరుగా ప్రచారం చేస్తున్నారు. దీంతో నగరంలో కూటమి వర్సెస్ ఏబీవీ అన్నట్లు రాజకీయం మారిపోయిందని విశ్లేషిస్తున్నారు. అయితే ఇదంతా సోషల్ మీడియా సృష్టి మాత్రమేనని, క్షేత్రస్థాయిలో కూటమి, విపక్షం వైసీపీ మధ్య ముఖాముఖి పోరు మాత్రమే ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దీనికి కారణంగా డిజిటల్ ప్రచారంలో ఏబీవీ పైచేయి సాధిస్తున్నప్పటికీ, డివిజన్ పర్యటనల్లో జోరు చూపలేకపోవడమే అంటున్నారు.

అంతా డిజిటల్ ప్రచారమే..

స్వతంత్ర అభ్యర్థిగా మేయర్ స్థానానికి పోటీ చేస్తున్న ఏబీవీ తొలి నుంచి సోషల్ మీడియా ప్రచారంలో ముందంజలో ఉన్నారని విశ్లేషిస్తున్నారు. రిటైర్ అయిన నుంచి సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ వివిధ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నిస్తున్న ఏబీవీకి ఈ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం డిజిటల్ మీడియా బాగా పనికొచ్చిందని విశ్లేషిస్తున్నారు. అయితే డిజిటల్ మీడియా విస్తృతి ఎక్కువగా ఉండటం, అందులో ఆయన ప్రచారం, అభ్యర్థన విజయవాడ నగర వాసులకు ఎంతవరకు చేరుతుందనే అంశమై ప్రశ్నలు



తలెత్తుతున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడి వారు అయినా డిజిటల్ ప్రచారంపై స్పందించవచ్చునని, కానీ వారు ఓటు వేసే అవకాశం ఉండదనే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో నేరుగా ప్రచారం చేయడం వల్లే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని పరిశీలకులు సూచిస్తున్నారు.

సమయమే అసలు సమస్య

డిజిటల్ మాధ్యమంలో జోరుగా ప్రచారం చేసుకుంటున్న ఏబీవీ.. ఓటర్లను చేరువయ్యే క్షేత్రస్థాయి పర్యటనల్లో వెనకబడుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నగరం పరిధిలో ఆయన తీరిక లేకుండా పర్యటిస్తున్నా, సమయం తక్కువగా ఉండటం వల్ల ముక్తసరిగా సరిపెట్టాల్సివస్తోందని, అదే సమయంలో తీరిక లేని నగర జనం ఆయన మాటలను వినేందుకు కూడా సరిగా సమయం కేటాయించలేకపోతున్నారని అంటున్నారు. దీనివల్ల ఏబీవీ ప్రచారం ప్రజలకు ఎంతవరకు చేరుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఏబీవీ ఎంతవరకు ప్రభావం చూపగలరనేది హాట్ టాపిక్ అవుతోంది. మేయర్ రేసులో దిగుతున్నట్లు ఏబీవీ ప్రకటించిన వెంటనే ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టాయని అంటున్నారు. అయితే ప్రచార తీరు చూసిన తర్వాత తమకు ఏం నష్టం లేదన్న ధీమా వ్యక్తం చేస్తున్నాయని చెబుతున్నారు.

అసలు వ్యూహం వేరే..

ఇక ఏబీవీ పోటీపై పరిశీలకులు రకరకాలుగా విశ్లేషిస్తున్నారు. మేయర్ గా పోటీ చేయాలన్న ఏబీవీ అనూహ్య నిర్ణయం వెనుక పక్కా రాజకీయ వ్యూహం ఉందని అంటున్నారు. రిటైర్ అయిన తర్వాత తనను నిర్లక్ష్యం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసంతృప్తితో రగిలిపోతున్న ఏబీవీ.. తన సామర్థ్యం ఏంటో నిరూపించుకోవడమే కాకుండా, ఆ మేరకు ప్రభుత్వ పెద్దలకు స్పష్టమైన సంకేతం ఇవ్వాలనే ఆలోచనతోనే ఈ ఎన్నికల రంగంలోకి దిగినట్లుగా అనుమానిస్తున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా తనకు వచ్చే ఓట్లే ప్రాతిపదికగా భవిష్యత్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలనే ఆలోచనతో ఏబీవీ రంగంలోకి దిగారని విశ్లేషిస్తున్నారు. ప్రధాన పార్టీలకు దీటుగా ఓట్లు సాధిస్తే విద్యావంతులు, ఉద్యోగుల్లో తన వాదన సరైనదిగా భావించి మరింత దూకుడుగా పనిచేయొచ్చని ఆయన ఆలోచనగా ఉందని, లేనిపక్షంలో తన వైఖరిని పునఃసమీక్షించుకునేలా అడుగులు వేయొచ్చని అంటున్నారు. ఏదిఏమైనా విజయవాడ కార్పొరేషన్ రేసును వ్యూహాత్మకంగా వాడుకోవాలనే ఆలోచనతోనే ఏబీవీ ఉన్నారని చెబుతున్నారు.

పోలవరం ప్రాజెక్టులో మరో కీలక మైలురాయి..
90.1 శాతం ఫిజికల్ ప్రోగ్రెస్

ఏలూరు, అక్టోబరు 29 పెన్ పవర్: ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా సాగుతుంది. తాజాగా పోలవరం ప్రాజెక్టు మరో ప్రధాన మైలురాయిని చేరుకుంది. సెప్టెంబర్ నాటికి ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణంలో 90.1 శాతంఫిజికల్ ప్రోగ్రెస్ సాధించగా, మొదటి విడత కింద 78 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నీటి వనరుల శాఖ కార్యదర్శి అధ్యక్షతన అక్టోబర్ 12నజరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సమర్పించిన నివేదిక ప్రకారం ప్రాజెక్టుకు సంబంధించిన హెడ్‌వర్క్స్, ప్రధాన కాలువల పనులు తుది దశకు చేరుకున్నాయి.

స్పిల్‌వే, గ్యాప్–3లో మెయిన్ డ్యామ్, గ్యాప్–1, 2లలో డయాఫ్రమ్ వాల్స్, అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్‌లు, అప్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్ బట్రెస్, కుడి కాలువ పనులు వంద శాతం పూర్తయ్యాయి.

సివిల్ పనుల్లో 88 శాతం ఆర్థిక పురోగతి, భూసేకరణలో 95.6 శాతం పూర్తైందని నివేదిక తెలిపింది. అయితే, నిర్వాసితుల పునరావాసం, పునర్నిర్మాణం పనులు ప్రస్తుతం 51.9 శాతం వద్దఉండటంతో, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు దీనిపై దృష్టి సారించారు. ఆగస్టు 28, 2024న కేంద్ర క్యాబినెట్ ఫేజ్–1 వ్యయం రూ. 30,436.95 కోట్లకు సవరించి ఆమోదంతెలిపింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాజెక్టుకు నిరంతరంగా ఆర్థిక సహాయం అందుతోంది. ఏప్రిల్ 1, 2014 నుండి ఇప్పటివరకు కేంద్రం రూ. 23,485.31 కోట్లను విడుదల చేసింది.ఇందులో నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసేందుకు 2024--25, 2025--26 సంవత్సరాలకు గానూ రూ. 7,862.93 కోట్ల ముందస్తు గ్రాంట్ మంజూరు చేసింది. పోలవరం ప్రాజెక్టుపూర్తి చేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాయి. డిసెంబర్ 2026 నాటికి ప్రాజెక్టు ప్రాథమిక కనెక్టివిటీ పనులన్నీ పూర్తి చేయనున్నారు. మార్చి 2027 నాటికిగ్యాప్–1లోని ఎర్త్–కమ్–రాక్–ఫిల్ డ్యామ్ ఎంబ్యాంక్‌మెంట్ పనులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ 2027 నాటికి గ్యాప్–2 ఎంబ్యాంక్‌మెంట్ పనులతో పాటు స్కాడా కంట్రోల్ బిల్డింగ్,ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు, యాక్సెస్ రోడ్లు, స్లోప్ ప్రొటెక్షన్ పనులు పూర్తి చేసి ప్రాజెక్టును రెడీ చేయనున్నారు.

నాదెండ్ల మనోహర్ వైపే గురి....

గుంటూరు, అక్టోబరు 29 పెన్ పవర్:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో , ముఖ్యంగా డిజిటల్ స్పేస్‌లో ప్రస్తుతం తీవ్రమైన చర్చకు దారితీస్తున్న అంశం జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ లక్ష్యంగా సాగుతున్నసోషల్ మీడియా దాడులు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొంతమంది జనసేన సానుభూతిపరులు, అభిమానులు , శ్రేణులు అని చెప్పుకునే నెటిజన్లు నేరుగా నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేస్తూ.. ఆయనపార్టీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని, లేదా ఆయనను పక్కన పెట్టాలని పోస్టులు పెట్టడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. గతంలో అనేక సందర్భాల్లో జనసేనాని పవన్ కళ్యాణ్ స్పందిస్తూ నాదెండ్లమనోహర్‌ను ఏమైనా అంటే నన్ను అన్నట్లే, పార్టీ కష్టకాలంలో నిలబడిన శ్రేయోభిలాషి ఆయన అని బహిరంగ వేదికలపై స్పష్టమైన హామీ ఇచ్చినా కూడా.. ఈ ప్రచారం తగ్గకపోవడం వెనుక పెద్ద పొలిటికల్‌స్కిట్ నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నిజానికి, 2019 ఘోర పరాజయం తర్వాత జనసేన ఉనికిని కాపాడుకోవడంలో, క్షేత్రస్థాయిలో పార్టీకి ఒక బలమైన ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్‌తీసుకురావడంలో నాదెండ్ల మనోహర్ పాత్రను ఎవరూ కాదనలేరు. మాజీ స్పీకర్‌గా ఆయనకున్న రాజకీయ అనుభవం, లీగల్ , అడ్మినిస్ట్రేటివ్ పరిజ్ఞానం పవన్ కళ్యాణ్‌కు ఎంతో ఉపకరించాయి. పార్టీనాయకులు కార్యకర్తలను సమన్వయం చేయడం, పొత్తుల చర్చల సమయంలో టీడీపీ–బీజేపీ అగ్రనేతలతో సంప్రదింపులు జరపడం వంటి క్లిష్టమైన బాధ్యతలను నాదెండ్ల ఎంతో సైలెంట్‌గా నిర్వర్తించారు.అలాంటి వ్యూహకర్తను ఇప్పుడు ఉన్నపలంగా సొంత పార్టీకి చెందిన నెటిజన్లే నిందించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనేది ప్రధాన ప్రశ్నగా మారింది.ఈ టార్గెటింగ్ వెనుక మొదటి ప్రధాన కారణం.. సీట్లకేటాయింపులు , స్థానిక సంస్థల టికెట్ల అసంతృప్తి . కూటమి ప్రభుత్వంలో జనసేన 21 అసెంబ్లీ స్థానాల్లో 100% స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించినప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పొత్తుల కారణంగా అనేకమందిక్షేత్రస్థాయి నేతలకు, పోటీ చేయాలనుకున్న ఆశావహులకు సీట్లు దక్కలేదు. మున్సిపల్, పంచాయతీ, పరిషత్ ఎన్నికలలో కూడా సీట్ల కేటాయింపుల బాధ్యత నాదెండ్ల మనోహర్ నేతృత్వంలోని పిఏసిసమీక్షిస్తుండటంతో.. అవకాశాలు రాని ఆశావహులు తమ కోపాన్ని పవన్ కళ్యాణ్‌పై చూపించలేక, ఆయనకు కుడి భుజంగా ఉన్న నాదెండ్లపైకి మళ్లిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌నుకలవడానికి లేదా ఆయన వరకు తమ ప్రతిపాదనలు తీసుకెళ్లడానికి నాదెండ్ల మనోహర్ ఒక పెద్ద అడ్డంకిగా మారారని, ఆయన అనుమతి లేనిదే అధినేతను కలిసే అవకాశం దక్కడం లేదని ద్వితీయ శ్రేణినేతలలో కొంత అసహనం ఉంది. రాజకీయాల్లో పార్టీ అధినేత చుట్టూ ఉండే రక్షణ కవచం వంటి నేతలే ఎప్పుడూ క్యాడర్ ఆగ్రహానికి మొదటి బాధితులవుతుంటారు. ఈ క్రమంలోనే పవన్ కంటే ముందునాదెండ్ల విమర్శల దాడికి గురవుతున్నారు.విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రత్యర్థులు జనసేనను సంస్థాగతంగా బలహీనపరచడానికి డివైడ్ అండ్ రూల్ వ్యూహాన్ని అమలు చేస్తున్నాయనే కోణాన్నితోసిపుచ్చలేం. నాదెండ్ల మనోహర్‌ను సామాజిక వర్గపరంగా, అలాగే రైట్ హ్యాండ్ స్థానం నుంచి వేరు చేయగలిగితే.. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న పరిపాలనా వ్యవస్థ, సమన్వయం దెబ్బతింటుందనేదిప్రత్యర్థుల ఆలోచన అయి ఉండవచ్చు. సోషల్ మీడియాలో డమ్మీ ప్రొఫైల్స్ ద్వారా జనసేన కార్యకర్తల పేరిట నాదెండ్లపై నెగెటివ్ ప్రచారం చేయించడం ఈ మైండ్ గేమ్‌లో భాగమని భావిస్తున్నారు. అసలునాదెండ్ల మనోహర్‌ను పార్టీకి దూరం చేస్తే లేదా ప్రాధాన్యత తగ్గిస్తే ఎవరికి లాభం.. ప్రథమంగా, ఇది జనసేనకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ పూర్తిస్థాయి డిప్యూటీ సీఎంగా నిరంతరం బిజీగాఉండే సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలు చూసే అనుభవజ్ఞుడైన అడ్మినిస్ట్రేటివ్ ఫేస్ కరువవుతుంది. రెండవది, కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, బీజేపీలతో సత్సంబంధాలు నెరపే సమన్వయకర్తతగ్గిపోతారు. ప్రత్యర్థులకు ఇది చాలా పెద్ద విజయం కాగా, జనసేనలోని కొన్ని అసంతృప్తి వర్గాలకు తాత్కాలిక సంతోషాన్ని ఇవ్వవచ్చు. సోషల్ మీడియా ట్రోలింగ్స్ , అసంతృప్తులు రాజకీయాల్లో సహజమేఅయినప్పటికీ, నాదెండ్ల మనోహర్ లాంటి సీనియర్ నాయకుడి విషయంలో క్రమశిక్షణ తప్పడం పార్టీకి నష్టం కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి తన స్పష్టమైన సందేశాన్ని మళ్లీ శ్రేణులకుఅందిస్తే తప్ప, నాదెండ్లపై సాగుతున్న ఈ డిజిటల్ ప్రచారానికి తెరపడకపోవచ్చు

స్థానిక ఎన్నికల వేళ టీడీపీలో అంతర్గత సెగ..

విజయవాడ, అక్టోబరు 29 పెన్ పవర్:

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంటున్న వేళ కూటమి పార్టీల్లో అంతర్గత విభేదాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు, స్థానిక నాయకులకు మధ్య కొనసాగుతున్న అసంతృప్తి ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ఎన్నికల సమయంలో సహకరించకపోవడం పార్టీ విజయావకాశాలను దెబ్బతీస్తుందని ఎమ్మెల్యే వర్గాలు భావిస్తున్నాయి. నవంబరు 1న జరగనున్న మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలనేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.తెలుగుదేశం పార్టీ లో కొన్ని ప్రాంతాల్లో స్థానిక నాయకులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లోచర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేలు తమకు సంబంధించిన నాయకులకే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇతర వర్గాలను పట్టించుకోవడం లేదని అసంతృప్తితో ఉన్న నేతలు ఆరోపిస్తున్నట్లు సమాచారం. దీంతోఅధికారిక అభ్యర్థులకు ప్రచారంలో అవసరమైన సహకారం అందడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు, ఎన్నికల సమయంలో అందరూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యేలుతమ అనుచరులకు సూచిస్తున్నట్లు తెలుస్తోంది.ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కు, స్థానికంగా ఉన్న కొన్ని నాయకుల వర్గాలకు మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారంరాజకీయంగా చర్చకు దారితీసింది. ఆమెకు సన్నిహితంగా ఉన్న నాయకులకు కొందరు స్థానిక నేతలు సహకరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకుకూడా కొన్ని వర్గాల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదనే చర్చ సాగుతోంది. అయితే ఈ పరిణామాలపై సంబంధిత నాయకుల అధికారిక స్పందనలు, పూర్తి వివరాలు వెలువడాల్సిఉంది.మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులను ఆశించిన నాయకులకు అవకాశం దక్కకపోవడం కూడా అసంతృప్తికి కారణమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం నాయకులు, వారి కుటుంబ సభ్యులుపదవులను ఆశించగా, పొత్తులో భాగంగా ఆ స్థానాలు జనసేన , భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల పార్టీ కోసం పనిచేసినప్పటికీ తమకు అవకాశం రాలేదనిభావిస్తున్న నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారనే వార్తలు వస్తున్నాయి. పార్టీ అధిష్టానం నుంచి సూచనలు వచ్చినా, బుజ్జగింపు ప్రయత్నాలు సాగుతున్నా అసంతృప్తి పూర్తిగా తగ్గడం లేదనేఅభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విజయవాడ, విజయనగరం , కర్నూలు, అనంతపురం, చిత్తూరు వంటి నగరాల్లో స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఎన్నికల ఫలితాలకు కీలకంగా మారే అవకాశంఉంది. అభ్యర్థులకు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మద్దతు లభించకపోతే ప్రచార ప్రభావం తగ్గే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకత్వం పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, విభేదాలనుపరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అసంతృప్త నేతలకు నామినేటెడ్ పదవులు కల్పించడం ద్వారా వారిని పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా భాగస్వాములను చేసే ఆలోచన కూడా చర్చలో ఉంది.చివరి దశ ప్రచారంలో అసంతృప్తులను ఎంతవరకు సమన్వయం చేయగలరన్నది ఇప్పుడు కీలకంగా మారింది. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు కలిసిపనిచేస్తారా? లేక అంతర్గత పోరు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందా? అన్నది నవంబరు 1న జరిగే ఎన్నికలతో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

కమలా హారిస్ పేరుపై ట్రంప్ ఎగతాళి.. ఓరినీ నీ దుంపతెగ.. ఇలా తయారయ్యావేంటయ్యా సామీ

ఒక అగ్రరాజ్యం అధ్యక్షుడికి ఎలాంటి లక్షణాలు ఉండాలో అవేవీ లేని మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడు బహుషా మన ట్రంప్ యే కావచ్చు. దీనికి ఆయనకు అవార్డ్ ఇవ్వాల్సిందే.. సవాలక్ష అవలక్షణాలు, నోటి దురుసు.. ప్రత్యర్థులు, మీడియాను ఎగతాళి చేసే అధ్యక్షుడు బహుశా అమెరికా చరిత్రలో మళ్లీ రాబోరు.. ఇందుకు అమెరికన్లు అంతా గర్వపడుతూ కాలర్ ఎగరేసుకోండి.. ట్రంప్ దుందుడుకుతనాన్ని అనుభవించండి.. ఓటేసి గెలిపించినందుకు భరించండి.. ఎప్పుడూ ఏదో రాజేయనిది ట్రంప్ ఎందుకు అవుతాడు.. తాజాగా మన భారత సంతతి మూలాలున్న మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పేరుపై ట్రంప్ ఎగతాళి చేయడం చూసి అంతా ముక్కున వేలేసుకున్నారు.అమెరికా అధ్యక్ష ఎన్నికల వాతావరణం రోజూ ఓ రంగు మార్చే డ్రామాను తలపిస్తోంది. పాలసీలు, ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాల గురించి సీరియస్‌గా మాట్లాడాల్సిన ప్రచార పర్వంలో.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం సరికొత్త 'భాషా నైపుణ్యాల'తో సందడి చేస్తున్నారు. టెక్సాస్‌లో జరిగిన ఒక భారీ ప్రచార ర్యాలీలో ఆయన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పేరును రకరకాలుగా పలుకుతూ ఆమె భారతీయ మూలాలను ఉద్దేశించి వేసిన వ్యంగ్య బాణాలు భారతీయ అమెరికన్లకు కాస్తంత చిరాకును తెప్పిస్తున్నాయి.

"పేరులో ఏముంది?" అని ట్రంప్‌ని అడిగితే ఎలా?

పదవుల పోటీ పక్కన పెడితే.. శత్రువు పేరును పలకడంలో కూడా ఓ ప్రత్యేకమైన స్ట్రాటజీ వెతుక్కోవడం ఒక్క ట్రంప్‌కే చెల్లింది. "కమలా.. కమాలా.. కామలా.. ఎలా పిలిచినా ఒకటే" అంటూ ఆయన వేసిన జోకులు సభలోని అభిమానులను నవ్వించాయేమో కానీ అంతర్జాతీయంగా మాత్రం "ఏంటి సామీ ఇది.. పేరు పలకడం కూడా ఇంత పెద్ద సమస్యా?" అని ముక్కున వేలేసుకునేలా చేశాయి. అమెరికాను ప్రపంచ సూపర్ పవర్‌గా నడిపిస్తున్న ఒక అగ్రనేత.. ఎదుటివారి సాంస్కృతిక గుర్తింపును.. పేరును పట్టుకుని కామెడీ చేయడాన్ని చూస్తుంటే.. 'స్కూల్ లంచ్ బ్రేక్‌లో తోటి పిల్లల పేర్లు పెట్టి వెక్కిరించే చిన్నపిల్లల గొడవలు' గుర్తురాక మానవు. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఒకరి పేరును సరిగ్గా ఉచ్చరించలేకపోవడం అసమర్థతా.. లేక కావాలని చేసే రాజకీయ వ్యూహమా అనే సందేహం ఇప్పుడు ఓటర్లలో ముదిరిపాకాన పడింది.

ఐడెంటిటీ కార్డు వర్సెస్ ఓటు కార్డు

ట్రంప్ ప్లాన్ ప్రకారం.. సరిహద్దు భద్రత, బైడెన్–కమలా మార్క్ 'వలస విధానాల' వైఫల్యాలపై దండెత్తడమే ఆయన అసలు లక్ష్యం. కానీ సరిహద్దు గోడల గురించి మాట్లాడాల్సిన నోటితో.. కమల మూలాల గురించి వ్యాఖ్యానించడం ద్వారా ఆయన 'సొంత వికెట్' పడేసుకున్నారా అనే అనుమానాలు వస్తున్నాయి. అమెరికాలో ఐటీ నుంచి మెడికల్ రంగాల వరకు తమ చాతుర్యంతో జెండా పాతడమే కాకుండా రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగిన భారతీయ అమెరికన్లు ఈ నాటకాన్ని చూసి పెదవి విరుస్తున్నారు. "మా పేర్లు మా సంస్కృతి మీకు కేవలం ప్రచారంలో జోకులు వేసుకోవడానికే పనికొస్తున్నాయా?" అని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల కోసం 'నమస్తే ట్రంప్'లు చెప్పే నాయకులు.. తీరా ఎన్నికల సభలకు వచ్చేసరికి సంస్కృతిని హేళన చేయడం కాస్త విడ్డూరంగానే ఉంది.

నాటకానికి క్లైమాక్స్ ఎప్పుడు?

అమెరికా ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత స్వేచ్ఛ, భిన్న సంస్కృతుల సమ్మిళితత్వం ఎంత ముఖ్యమో రాజ్యాంగం పదే పదే చెప్తుంటుంది. కానీ, రాజకీయ వేదికలపై మాత్రం ఇవేమీ పట్టవు. ఒకవైపు బైడెన్–హారిస్ మార్క్ పాలనపై విమర్శలు చేస్తూనే.. మరోవైపు ట్రంప్ మాటల దూకుడు సొంత పార్టీకే తిప్పలు తెచ్చిపెడుతోంది. ప్రత్యర్థుల పాలసీలపై విమర్శలు గుప్పించి ఓట్లు అడిగితే అది రాజకీయ వ్యూహం అవుతుంది. కానీ పేర్లను పట్టుకుని హేళన చేస్తే అది కేవలం 'టైమ్ పాస్' కామెడీగానే మిగిలిపోతుంది. ఈ 'నేమ్ గేమ్' వివాదం ఎంత దూరం వెళ్తుందో.. త్వరలో రాబోయే ఎన్నికల ఫలితాల్లో భారతీయ ఓటర్ల దెబ్బ ట్రంప్‌కు ఏ రీతిలో తగులుతుందో చూడాలి. దాని కోసం మనం వేయికళ్లతో ఎదురుచూద్దాం.. ట్రంప్ మొహం వాలిపోయే రోజు కోసం వెయిట్ చేద్దాం..

'టెక్' కన్నీళ్లు.. రోజుకు 654 కుటుంబాల్లో ఆరిపోతున్న ఆశల దీపాలు

నిన్నటివరకు ల్యాప్‌టాప్ స్క్రీన్ల ముందు కాంతివంతంగా వెలిగిన ఆ కళ్ళు.. నేడు అనిశ్చితి నీడల్లో తడిసిముద్దవుతున్నాయి.. ఒకప్పుడు టెక్ ఉద్యోగం అంటే భవిష్యత్తుకు బలమైన భరోసా.. కానీ నేడు పొద్దున్నే ఆఫీస్ మెయిల్ ఇన్ బాక్స్‌లో ఏ 'పింక్ స్లిప్' వేచి ఉందో అని నిమిషానికోసారి ధడధడలాడే గుండెచప్పుడు.. రోజుకు ఏకంగా 654 మంది ఉద్యోగాలు కోల్పోతుంటే.. అది కేవలం కార్పొరేట్ లెక్కల కోత మాత్రమే కాదు.. వేలాది కుటుంబాల ఇళ్లల్లో ఆరిపోతున్న ఆశల దీపాల కన్నీటి గాథ...

ఒకప్పుడు ఐటీ ఉద్యోగం అంటే కేవలం ఒక కొలువు మాత్రమే కాదు.. అదొక సగౌరవ జీవితం.. కన్నవారి కళ్ళల్లో ఆనందం.. భవిష్యత్తుపై కొండంత భరోసా.. "మా వాడు ఆ టాప్ టెక్ కంపెనీలో పనిచేస్తున్నాడు" అని తల్లిదండ్రులు గర్వంగా చెప్పుకునే రోజులు అవి. కానీ నేడు అదే టెక్ ప్రపంచంలో అడుగడుగునా ఆందోళన.. గుండెల్లో భయం నీడలు కమ్ముకున్నాయి. నిన్నటివరకు వెలుగులద్దిన కార్పొరేట్ ఆఫీసులు.. నేడు వేలాది మంది ఉద్యోగుల జీవితాల్లో అంధకారాన్ని నింపుతున్నాయి.

గణాంకాలు కావు.. వేలాది కుటుంబాల కన్నీటి గాథలు..

ట్రూ అప్ నివేదిక వెల్లడించిన నిజాలు గుండెల్ని పిండేస్తున్నాయి. ఈ ఒక్క ఏడాదిలోనే దాదాపు 674 కంపెనీలు లేఆఫ్స్‌ను ప్రకటించగా.. 1,97,640 మందికి పైగా తమ ఉపాధిని కోల్పోయారు. అంటే.. సగటున రోజుకు 654 మంది ఉద్యోగాలు గల్లంతవుతున్నాయి. ఇవి కేవలం కాగితాలపై కనిపించే అంకెలు కావు.. 654 కుటుంబాలు ఎదుర్కొంటున్న మానసిక నరకానికి ప్రతీకలు. ప్రతీ నెలా కట్టాల్సిన ఇంటి ఈఎంఐలు.. పిల్లల స్కూల్ ఫీజులు.. వయోవృద్ధులైన తల్లిదండ్రుల వైద్య ఖర్చులు.. నిత్యం బాధిస్తున్న ఇంటి అద్దెలు.. ఉద్యోగం పోయిన మరుక్షణమే ఇవన్నీ ఒకటొకటిగా వచ్చి గుండెపై కొండంత భారమై కూర్చుంటున్నాయి.

దిగ్గజ సంస్థల బిగ్ షాక్

ప్రపంచ ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ మళ్లీ ఉద్యోగుల కోతకు తెగబడటం... మైక్రోసాఫ్ట్ ఏకంగా 60 వేల మంది ఉద్యోగులకు వాలంటరీ బైఅవుట్ ఆఫర్లు ఇవ్వడం టెక్ రంగాన్ని షాక్‌కు గురిచేస్తోంది. ఎంత పెద్ద కంపెనీలో పనిచేసినా ఉద్యోగ భద్రత లేదనే పచ్చి నిజం ఉద్యోగులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేరుతో ముంచుకొస్తున్న ఈ మార్పులు మనుషుల ఉపాధిని మింగేస్తున్నాయి.

జీతం మాత్రమే కాదు.. ఆత్మవిశ్వాసమూ పోతోంది..

లేఆఫ్స్ వల్ల పోయేది కేవలం నెలాఖరున వచ్చే జీతం మాత్రమే కాదు.. సమాజంలో ఒక ఉద్యోగికి ఉండే గుర్తింపు.. ఆత్మవిశ్వాసం.. కుటుంబానికి అండగా ఉన్నాననే ధైర్యం.. ఎంతటి సవాళ్లనైనా ఎదుర్కొనే టెక్కీలు.. నెలల తరబడి ఇంటర్వ్యూల చుట్టూ తిరిగి రిజెక్ట్ అవుతుంటే మానసికంగా నలిగిపోతున్నారు. సాంకేతిక అభివృద్ధి అనేది మనుషుల జీవితాలను సులభతరం చేయడానికి ఉపయోగపడాలి గానీ.. వారి జీవనాధారాన్నే దెబ్బతీసేలా ఉండకూడదు. ఆర్థిక మార్పులు అనివార్యమే కావచ్చు.. కానీ సంస్థలు లాభాల వేటలో ఉద్యోగుల మానవీయ కోణాన్ని.. వారి జీవన భద్రతను విస్మరించకూడదు.

ఇజ్రాయెల్‌లో హంగ్.. అరబ్ పార్టీలకు దూరంగా నెతన్యాహు కొత్త ఎత్తుగడ!

ఇజ్రాయెల్ లో మెజార్టీ యూదులు.. వీరి పొడగిట్టని అరబ్బులతో యుద్ధాలు చేసి నిలబడ్డ వీరులు.. దేశంలో మెజార్టీ వారిదే.. కానీ సరిహద్దుల్లో, పాలస్తీనా ప్రాంతంలో కొంతమంది అరబ్బులు ఉంటారు. ఆ చోట్లే వారే గెలిచారు. ఇజ్రాయెల్ లో ఈసారి ఎవరికీ మెజార్టీ రాకుండా హంగ్ ప్రభుత్వం ఏర్పడడంతో 'అరబ్బులు' గెలిచిన సీట్లు కీలకమయ్యాయి. అరబ్బులతో పోరాడుతూ వారి మద్దతు తీసుకోవడం అస్సలు ఇష్టం లేని ఇజ్రాయెల్ లోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఏ దేశంలో జరగని విధంగా కొత్త పొత్తుకు శ్రీకారం చుట్టడం హాట్ టాపిక్ గా మారింది.ఇజ్రాయెల్ రాజకీయాలు మరోసారి తీవ్ర ఉత్కంఠభరిత పరిణామాలకు వేదికగా మారాయి. ఇటీవల ముగిసిన ఎన్నికల అనంతరం ఏ ఒక్క కూటమికీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో అక్కడ తీవ్ర రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అధికారంలో కొనసాగేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై తీవ్రంగా దృష్టి సారించినట్లు వార్తలు వెలువడుతున్నాయి.ఇజ్రాయెల్ పార్లమెంట్‌లోని మొత్తం 120 స్థానాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కనీసం 61 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే ఇటీవల వెలువడిన ఫలితాల్లో నెతన్యాహు కూటమికి గానీ.. ప్రతిపక్ష శిబిరానికి గానీ అవసరమైన మెజారిటీ దక్కలేదు. ఈ హంగ్ పరిస్థితిని అధిగమించేందుకు ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ సైనిక అధిపతి గాడి ఐసెన్‌కోట్‌తో కలిసి 'నేషనల్ యూనిటీ' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నెతన్యాహు ఆలోచిస్తున్నట్లు 'ది జెరూసలెం పోస్ట్' కథనాలు వెల్లడిస్తున్నాయి.ఈ ప్రత్యామ్నాయ ఒప్పందంలో ప్రధానంగా రెండు అవకాశాలపై చర్చ నడుస్తోంది. మొదటిది నిర్ణీత కాలానికి ప్రధానమంత్రి పదవిని నెతన్యాహు, ఐసెన్‌కోట్ పంచుకునేలా అధికార మార్పిడి ఒప్పందం చేసుకోవడం. రెండోది ఐసెన్‌కోట్‌కు ప్రభుత్వంలో అత్యంత కీలకమైన సీనియర్ మంత్రి పదవిని కేటాయించి ఆయన వర్గం మద్దతుతో ప్రభుత్వాన్ని నడపడం. భద్రతా వ్యవహారాలపై విశేష అనుభవం ఉన్న ఐసెన్‌కోట్ మద్దతు లభిస్తే పాలనలో స్థిరత్వం వస్తుందని కొందరు భావిస్తున్నారు.అయితే ఈ ప్లాన్–బి ఆచరణలోకి రావడం అంత సులువు కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నెతన్యాహు కూటమిలోని అతివాద రైట్ వింగ్ మిత్రపక్షాలు.. ముఖ్యంగా ఇటమార్ బెన్‌గ్విర్ వంటి నేతలు.. ప్రతిపక్షంతో చేతులు కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు గతంలో నెతన్యాహు నేతృత్వంలో పనిచేసేందుకు ఐసెన్‌కోట్ నిరాకరించిన నేపథ్యంలో ఈ కొత్త ప్రతిపాదనకు ఆయన అంగీకరిస్తారా లేదా అనేది పెద్ద ప్రశ్నగా మారింది.రాష్ట్రపతి ఐజాక్ హెర్జోగ్ చేపట్టబోయే సంప్రదింపులు.. వివిధ పార్టీల మధ్య జరిగే తుది చర్చల ఆధారంగా నెతన్యాహు ప్లాన్–బి కార్యరూపం దాలుస్తుందా లేదా అనేది తేలనుంది. ఒకవేళ ఈ జాతీయ ఐక్యత ప్రభుత్వం ఏర్పాటైతే అది ఇజ్రాయెల్ రాజకీయాల్లో ఒక కీలక మార్పుగా నిలుస్తుంది. లేని పక్షంలో నెతన్యాహు మరో ప్రత్యామ్నాయాన్ని అన్వేషించక తప్పదు.అరబ్బు పార్టీలు, సీట్లతో కలవమని నెతన్యాహు, ప్రతిపక్ష నేత ఐసెన్‌కోట్ కలవమని.. అది ఇజ్రాయెల్ సిద్ధాంతాలకే వ్యతిరేకం అని అంటున్నారు. మరి వీరిద్దరూ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా? ఇజ్రాయెల్ లో ఏం జరుగనుందనేది ఉత్కంఠ రేపుతోంది.

ఏకగ్రీవ ఎన్నికలు : అప్పుడు, ఇప్పుడు తేడా ఏంటి? ఆసక్తికర లెక్కలు

ఏపీలో స్థానిక ఎన్నికల చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోంది. పట్టణ స్థానిక సంస్థలతోపాటు జిల్లా, మండల పరిషత్ పాలకవర్గాలు, పంచాయతీలకు వరుసగా ఎన్నికలు నిర్వహిస్తుండటంతో ఎటు చూసినా రాజకీయ నాయకుల హడావుడే కనిపిస్తోంది. ప్రధానంగా అధికార, విపక్షాల మధ్య హోరాహోరీ పోరు నడుస్తుందని భావించగా, కొన్నిచోట్ల ఏకగ్రీవంగా ఎన్నికల తంతు ముగించడం హాట్ టాపిక్ అవుతోంది. తమ నామినేషన్లు స్వీకరించకుండా, దౌర్జన్యంతో ఏకగ్రీవం చేసుకున్నారని విపక్షం ఆరోపిస్తుండగా, అభ్యర్థులు లేకపోవడంతో విపక్షం ఇలాంటి ఆరోపణలు చేస్తోందని అధికార కూటమి వాదిస్తోంది. అయితే ఏకగ్రీవ ఎన్నికలు జరిగిన చోట అధికారపక్షం బలప్రయోగం చేసిందనే ప్రచారమే ఎక్కువగా జరుగుతోందని సోషల్ మీడియాలో పలువురు విశ్లేషిస్తున్నారు. దీనిని సమర్థించుకునేందుకు గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు దౌర్జన్యం చేశారని, వారిపై రివేంజ్ కోసం ఇప్పుతు తమవారు ఏకగ్రీవాలు చేసుకున్నారని కూటమి నేతలు చెప్పుకొస్తున్నారు. దీంతో అప్పుడు ఏం జరిగింది, ఇప్పుడు ఏం జరుగుతోందన్న చర్చ ఎక్కువగా నడుస్తోంది.

వైసీపీ హయాంలో ఏమైంది?

విపక్షం వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. అప్పట్లో అధికార పక్షం ఏకపక్షంగా వ్యవహరించి 99 శాతం విజయాలు నమోదు చేసిందని టీడీపీ ఆరోపిస్తోంది. ఆ సమయంలో దాడులు, దౌర్జన్యాలను నిరసిస్తూ టీడీపీ బహిష్కరించినట్లు చెబుతున్నారు. దీంతో అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 నుంచి 25 శాతం స్థానాలు ఏకగ్రీవమయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏకగ్రీవ విజయాలు ఎన్నికల చరిత్రలోనే ఒక రికార్డుగా నమోదయ్యాయని అంటున్నారు. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 660 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే 126 స్థానాలలో పోటీ లేకుండా వైసీపీ గెలుచుకుందని రికార్డులు చెబుతున్నాయి. అదేవిధంగా దాదాపు 10 వేల ఎంపీటీసీ స్థానాల్లో 2,371 స్థానాలను వైసీపీ ఏకగ్రీవం చేసుకున్నట్లు చెబుతున్నారు. ఇదేసమయంలో కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు వంటి జిల్లాలను వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకుందని అంటున్నారు.

రాయలసీమ, పల్నాడులో అధికం

ప్రధానంగా రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో అత్యధిక ఏకగ్రీవాలు నమోదైనట్లు చెబుతున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గమైన పుంగనూరు పరిధిలోని 84 గ్రామాల్లో 84 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. పల్నాడులోని మాచర్ల నియోజకవర్గంలో 74 గ్రామాలకు 74 ఏకగ్రీవంగా వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఇక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో మెజారిటీ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవంగా గెలుపొందారు. ఇక మున్సిపాలిటీల్లో మొత్తం 2,794 వార్డులు ఉండగా, సుమారు 578 వార్డులు వైసీపీకి ఏకగ్రీవమయ్యాయి. పుంగనూరు మున్సిపాలిటీలోని 31 వార్డులలో అన్ని స్థానాలూ ఏకగ్రీవమై, కౌన్సిల్ మొత్తం పోటీ లేకుండానే ఎన్నికైంది.

పంచాయతీలు ఏకపక్షం

అదేవిధంగా మాచర్ల, పులివెందుల మున్సిపాలిటీలు ఏకగ్రీవంగా వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి వెళ్లాయని అంటున్నారు. ఇక 2021 ఫిబ్రవరిలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 2,197 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఇందులో ఒక్క కడప జిల్లాలోనే అత్యధికంగా 76 శాతం స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. చిత్తూరు, కర్నూలు, గుంటూరు (పల్నాడు) జిల్లాల్లో కూడా వందలాది పంచాయతీలు ఏకగ్రీవ తీర్మానాలతో సర్పంచులను ఎన్నుకున్నాయి. ఇవన్నీ బలవంతపు ఏకగ్రీవాలుగా చెబుతున్న కూటమి నేతలు ఇప్పుడు అదే పంథాను అనుసరించడంపై పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తప్పు చేశారని చెబుతూ ఇప్పుడు అదే తప్పును ప్రోత్సహించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కూటమిదీ అదే దారేనా?

ఇక గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కూటమి నేతలు ఇప్పుడు చాలాచోట్ల ఏకగ్రీవంగా ఎన్నికలను నిర్వహించడంపై వాడివేడి చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో 17 మున్సిపాలిటీలను, 130 మండల పరిషత్, 76 జడ్పీటీసీ స్థానాలను కూటమి పార్టీలు ఏకగ్రీవంగా గెలుచుకున్నట్లు చెబుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ దూకుడు చూపిన రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో రివేంజ్ తీర్చుకునేలా కూటమి నేతలు ఏకగ్రీవాలు నమోదు చేసిందని చెబుతున్నారు. అయితే వైసీపీ మాదిరిగానే టీడీపీ కూటమి సైతం బలవంతపు ఏకగ్రీవాలకు పాల్పడిందని ఎక్కువగా విమర్శలు వస్తున్నాయి. ఇదే సమయంలో కర్నూలు, నంద్యాల జిల్లాలలో టీడీపీ–వైసీపీ నేతలు అవగాహనతో ఏకగ్రీవాలు చేసుకోవడం చర్చనీయాంశం అవుతోంది.

ప్రస్తుత లెక్క ఇది..

గత ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో ఏకగ్రీవ ఎన్నికలు జరిగితే, ఈ సారి అంత భారీగా కాకపోయినా చాలాచోట్ల ఏకగ్రీవాలు నమోదు కావడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని చెబుతున్నారు. మొత్తం 1985 ఎంపీటీసీ స్థానాలు కూటమి ఏకగ్రీవంగా గెలుచుకోగా, వైసీపీ కూడా 93 ఎంపీటీసీ,

ఒక జడ్పీటీసీ స్థానాన్ని ఏకగ్రీవంగా కైవసం చేసుకుందని లెక్కలు తెలియజేస్తున్నాయి. గతంలో వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకున్న పులివెందుల, పుంగనూరు, మాచర్ల, గురజాల వంటి నియోజకవర్గాల్లో ప్రస్తుతం సీన్ రివర్స్ అయిందని అంటున్నారు.పుంగనూరు మున్సిపాలిటీని టీడీపీ ఏకగ్రీవంగా దక్కించుకోగా, పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండల పరిషత్తులు, మూడు జడ్పీటీసీలను టీడీపీ ఏకపక్షంగా దక్కించుకుందని అంటున్నారు. అదేవిధంగా పల్నాడు జిల్లాలోని మాచర్ల, నరసారావుపేట, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాల్లో వంద శాతం స్థానాలను కూటమి పార్టీలు కైవసం చేసుకున్నట్లు చెబుతున్నారు. ఇక వైసీపీ ఏకగ్రీవంగా గెలిచిన 93 స్థానాల్లో 69 కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉన్నాయి. ఈ జిల్లాల్లో బనగానపల్లి, డోన్, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లో టీడీపీ–వైసీపీ కలిసి ఏకగ్రీవం చేసుకున్నట్లు చెబుతున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి మండలంలో 20 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, టీడీపీ 12, వైసీపీ 7, బీజేపీ 1 చొప్పున పంచుకున్నాయి. అదేవిధంగా పత్తికొండలో 13 స్థానాలు ఏకగ్రీవమైతే టీడీపీ 9, వైసీపీ 3 దక్కించుకున్నాయి. ఇక వెల్దుర్తి మండలంలో కూడా వైసీపీ 4, టీడీపీ 11 చోట్ల ఏకగ్రీవం చేసుకున్నాయి.

పని వాయిదా వేస్తున్నారా? అది బద్ధకం కాకపోవచ్చు.. మీ మనసులోని భయమే అసలు కారణమంటున్న సైకాలజీ!

- పని వాయిదా వేయడం ఎప్పుడూ బద్ధకం వల్లే జరగకపోవచ్చంటున్న సైకాలజీ
- వైఫల్య భయం, ఆందోళన, విసుగు కూడా కారణాలు
- పని వాయిదా వేస్తే తాత్కాలికంగా ఉపశమనం
- తర్వాత గడువు ఒత్తిడి, పశ్చాత్తాపం పెరిగే ఛాన్స్
- తరచూ వాయిదా వేయడం మానసిక ఒత్తిడితో సంబంధం
- పనిని చిన్న భాగాలుగా విభజించడం వల్ల ఉపయోగం

చేయాల్సిన పని ఉందని తెలుసు.. గడువు దగ్గరపడుతోందని కూడా తెలుసు. అయినా పని మొదలుపెట్టకుండా ఫోన్ చూస్తూ, సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తూ, అనవసరమైన పనుల్లో సమయం గడుపుతున్నారా? 'రేపు ఎలాగైనా పూర్తి చేస్తా' అని రోజూ అనుకుంటున్నారా? అయితే మీరు బద్ధకస్థులని వెంటనే నిర్ణయించుకోవద్దు. దీని వెనుక మరో కారణం ఉండొచ్చని మనస్తత్వ శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. పని చేయడానికి బద్ధకం ఒక్కటే కారణం కాదు.. ఆ పని మనలో కలిగించే అసౌకర్యకరమైన భావాల నుంచి తప్పించుకోవాలనే ప్రయత్నం కూడా కావచ్చని వివరిస్తున్నారు.

అసలు కారణమేంటి?

ఒక ముఖ్యమైన అసైన్‌మెంట్ పూర్తి చేయాలనుకుందాం. దాన్ని మొదలుపెట్టగానే తప్పులు చేస్తానేమోననే భయం కలగవచ్చు. పని చాలా పెద్దదిగా అనిపించవచ్చు. ఎక్కడి నుంచి ప్రారంభించాలో అర్థంకాకపోవచ్చు. మరికొందరికి ఆ పని బోరింగ్‌గా అనిపించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో మనసుకు కలిగే అసౌకర్యాన్ని ఎదుర్కోవడం కంటే ఆ పనిని పక్కన పెట్టడం సులభంగా అనిపిస్తుంది. దాంతో కొద్దిసేపు ఉపశమనం లభిస్తుంది. పని చేయాల్సిన ఒత్తిడి నుంచి తాత్కాలికంగా బయటపడినట్లు అనిపిస్తుంది. కానీ చేయాల్సిన పని మాత్రం అలాగే మిగిలిపోతుంది.

మనస్తత్వ శాస్త్రవేత్తలు ఫుషియా సిరోయిస్, తిమోతి పైచిల్ పరిశోధనల్లో ఈ ప్రవర్తనను తక్షణ మానసిక ఉపశమనం కోసం పని వాయిదా వేయడంగా వివరించారు. అంటే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందుల కంటే ప్రస్తుతానికి మనసు ప్రశాంతంగా ఉండటానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం.

'రేపు చేసుకోవచ్చులే'.. ఈ ఆలోచనే సమస్య!

పని వాయిదా వేసేవారు రేపు ఎక్కువ సమయం ఉంటుందని, మరింత ఉత్సాహంగా ఉంటామని అనుకుంటారు. కానీ మరుసటి రోజు వచ్చినా పరిస్థితి మారకపోవచ్చు. పైగా గడువు దగ్గరపడటంతో ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఉదాహరణకు పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థి పాఠాలు చదవాల్సి ఉన్నా ఫోన్ చూస్తూ సమయం గడిపాడనుకుందాం. మొదట్లో చదవకపోవడం వల్ల కలిగే ఆందోళన తగ్గినట్లు అనిపిస్తుంది. కానీ పరీక్ష దగ్గరపడే కొద్దీ చదవాల్సిన అంశాలు పేరుకుపోతాయి. అప్పుడు ఆందోళనతో పాటు పశ్చాత్తాపం కూడా పెరుగుతుంది. ఇలా పని వాయిదా వేయడం, తర్వాత అపరాధ భావనకు గురికావడం, ఆ భావన నుంచి తప్పించుకోవడానికి మళ్లీ పనిని వాయిదా వేయడం.. ఒక చక్రంలా కొనసాగవచ్చు.

ఈ అలవాటు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందా?

తరచూ పనులు వాయిదా వేయడం వల్ల గడువుల ఒత్తిడి పెరగవచ్చు. పూర్తికాని పనుల గురించి పదేపదే ఆలోచించడం నిద్రపై, మానసిక ప్రశాంతతపై ప్రభావం చూపవచ్చు. దీర్ఘకాలిక ఒత్తిడి ఆరోగ్యాన్నీ ప్రభావితం చేసే అవకాశం ఉంది. వాయిదా వేయడం, ఆందోళన, ఒత్తిడి మధ్య సంబంధం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే ప్రతి ఒక్కరిలోనూ ఇదే కారణం ఉంటుందని చెప్పలేం.

పని వాయిదా వేయడం మానాలంటే ఏం చేయాలి?

1. పనిని చిన్న భాగాలుగా విభజించండి: పెద్ద పనిని ఒకేసారి పూర్తి చేయాలనే ఆలోచన ఒత్తిడిని పెంచుతుంది. దాన్ని చిన్న చిన్న దశలుగా విభజించండి.
2. ఐదు నిమిషాలతో మొదలుపెట్టండి: గంటల తరబడి పని చేయాలని లక్ష్యంగా పెట్టుకోకుండా, మొదట ఐదు నిమిషాలు కేటాయించండి. ఉదాహరణకు పుస్తకం తెరిచి ఒక పేజీ చదవడం లేదా డాక్యుమెంట్‌లో ఒక వాక్యం రాయడం మొదలుపెట్టండి.
3. ఏ భావన మిమ్మల్ని ఆపుతోందో గుర్తించండి: పని కష్టంగా అనిపిస్తోందా? తప్పులు చేస్తాననే భయమా? లేక విసుగుగా ఉందా? కారణం తెలుసుకుంటే దానికి తగిన పరిష్కారం వెతకవచ్చు.
4. మీపై మీరే నిందలు వేసుకోవద్దు: పని వాయిదా వేసినందుకు నిరంతరం బాధపడటం సమస్యను మరింత పెంచవచ్చు. జరిగిన దాన్ని అంగీకరించి, మళ్లీ చిన్న అడుగుతో ప్రారంభించండి.
5. సరైన మూడ్ కోసం ఎదురుచూడకండి: పని చేయాలనే ఉత్సాహం వచ్చినప్పుడే మొదలుపెట్టాలని అనుకుంటే మరింత ఆలస్యం కావచ్చు. చిన్న చర్యతో ప్రారంభించి, క్రమంగా ముందుకు సాగడం మంచిది.

ఆఫీస్ పనులతో బిజీగా ఉన్నారా? పిల్లలతో టైం గడపలేకపోతున్నారా ? ఈ కొత్త కాన్సెప్ట్ ట్రై చేయండి!

వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న చాలామందికి వర్కింగ్ అవర్స్ పెరిగాయి. మునుపటి కంటే టార్గెట్లు ఎక్కువయ్యాయి. దాంతో పేరుకు ఇంట్లో ఉంటున్నారే తప్ప, పిల్లలతో గడపడానికి టైం ఉండట్లేదు. అంతేకాదు, భార్యాభర్తలిద్దరూ వర్క్ ఫ్రమ్ హోమ్ లో ఉంటే, ఆ ఇల్లు ఒక ఆఫీస్ అయిపోతోంది. అమ్మానాన్నలు కంప్యూటర్ల ముందు కూర్చుంటే... పిల్లలు మరో రూమ్లో ఫోన్లలో ఆన్లైన్ క్లాసులు వింటున్నారు. అయితే ఇలాంటి బిజీ షెడ్యూల్ నుంచి బయటికొచ్చి పిల్లలతో గడిపేందుకు వచ్చిన కాన్సెప్ట్ 'డూ నతింగ్'. అంటే ఏ పనీ చేయకుండా ఉండటం.

ఆఖరిసారిగా మీరు ఏ పనీ చేయకుండా ఉన్నదెప్పుడు ? ఎప్పుడైనా ఖాళీగా ఉండి.. టైం వేస్ట్ కాలేదని అనుకున్నారా ? ఎలాంటి ప్లాన్ లేకుండా ఫ్యామిలీతో టైం స్పెండ్ చేశారా? ఇలాంటి ప్రశ్నలు కొత్తగా ఉంటాయి. 'పిల్లలతో రోడ్ ట్రిప్స్ కి వెళ్తున్నాం', 'పార్క్ లో గేమ్స్ ఆడుతున్నాం', 'ఆన్లైన్ క్లాసులప్పుడు హెల్ప్ చేస్తున్నాం.. ఇవన్నీ పిల్లల కోసమే కదా అంటారా? అయితే ఇవేవీ 'డూ నతింగ్' కిందకు రావు. మరి ఏం చేయకుండా ఎలా ఉండాలో తెలుసుకుందాం......

పది నిమిషాలు చాలు

ఆఫీస్ పని, ఇంట్లో పనులు రోజూ ఉండేవే. అయితే వాటికోసం ఇరవై నాలుగ్గంటలు కేటాయించనక్కర్లేదు. అలాగని "డూ నతింగ్" కోసం గంటల సమయం అవసరం లేదు. రోజు మొత్తంలో నాలుగు గంటలకోసారైనా ఐదు, పది నిమిషాలు కేటాయిస్తే చాలు. ఆ పది నిమిషాలు ప్రపంచానికి పూర్తిగా డిస్కనెక్ట్ అయ్యి ఫ్యామిలీతోనే ఉండాలి. కావాలంటే రోజులో ఎప్పుడెప్పుడు ఖాళీగా ఉండాలో ఒక షెడ్యూల్ వేసుకోవచ్చు. మొదట్లో ఆ టైం పీరియడ్ లో ఏం చేయాలో తెలియకపోవచ్చు. కానీ, వారాలు గడుస్తున్న కొద్దీ డూ నతింగ్ కాన్సెప్ట్ ని ఎవరికి వాళ్లు కొత్తగా ట్రై చేస్తారు. ఆఫీస్ ఫోన్ కాల్స్ మధ్యలో పావుగంట గ్యాప్ వచ్చినా, బాస్ తో అపాయింట్మెంట్ కాన్సిల్ అయినా.. ఆ టైం డూ నతింగ్ కి ఉపయోగించుకోవచ్చు. అంతేతప్ప ఆ గ్యాప్లో ఫోన్ పట్టుకోవడం, సోషల్ మీడియాలో స్క్రోలింగ్ చేయడం కాకుండా పిల్లలతో రిలాక్స్ అవ్వాలి.

ఆన్ ప్లగ్ గ్యాడ్జెట్స్

ఫిజికల్ గా.. మెంటల్ గా ఎప్పుడైనా డల్ అయినప్పుడు చాలామంది చేసేపని ఫోన్ పట్టుకోవడం లేదా టీవీ ఆన్ చేయడం.

అయితే ఈ రెండూ టైం, ఎనర్జీని వాడుకుంటాయే తప్ప బూస్ట్ చేయలేవు. డూ నతింగ్ కాన్సెప్ట్ మైండ్ అసలు ఎంగేజ్ లో ఉండకూడదు. ఫోన్ పట్టుకున్నారంటే.. బ్రెయిన్ దాన్ని చూసే పనిలో ఉందని, అదే బ్రెయిన్ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ ఎనర్జీని ఖర్చు చేస్తోందని అర్థం చేసుకోవాలంటాడు ఇంగ్లీష్ రైటర్ సిలెస్ట్ హెడ్లీ. అందువల్ల డూ నతింగ్ టైంని ఫోన్, టీవీకి కాకుండా ఫ్యామిలీకి ఇవ్వాలి. ఖాళీ టైం దొరికినప్పుడు ఫోన్ ని ఫ్లైట్ మోడ్లో పెట్టుకోవాలి. లాప్ టాప్ వంటి గ్యాడ్జెట్స్ ఆఫ్ చేయాలి. ఆ టైంలో పిల్లల్ని వీధుల్లో తిప్పుతూ ఆకాశంలో నెమ్మదిగా ప్రయాణిస్తున్న మేఘాలను చూస్తుండొచ్చు. కావాలంటే అలారం సెట్ చేసుకుని, మళ్లీ వర్క్ లో జాయిన్ అవ్వచ్చు.

స్టార్ట్ స్మాల్

డూ నతింగ్ అనేది అనుకున్నంత సులువు కాదు. ఎలాంటి ప్లాన్స్, షెడ్యూల్స్, ఎజెండా లేకుండా మైండ్ ని క్లియర్ గా ఉంచుకోవడమే ఈ కాన్సెప్ట్. పిల్లలైనా, పెద్దలైనా ఈ కాన్సెప్ట్ మొదలు పెట్టిన కొత్తలో ఎక్కువ సమయం ఖాళీగా ఉండటం కష్టం. అందువల్ల చిన్నచిన్న ఇంటర్వెల్స్ లో డూ నతింగ్ సెట్ చేసుకోవాలి. ఆఫీస్ వర్క్ లో ఉన్నప్పుడు మధ్యమధ్యలో ఐదు నిమిషాలు పిల్లలు, ఫ్యామిలీతో గడపొచ్చు. అలాగని వాళ్లతో బలవంతంగా బుక్ రీడింగ్, డ్రాయింగ్ చేయించడం కాదు. ఎలాంటి ఆలోచన లేకుండా వాళ్లతో గడపడం ముఖ్యం.

గిల్టీ ఫీలింగ్ వద్దు

ఇంతసేపు ఏమీ చేయకుండా టైం వేస్ట్ చేశామనే గిల్టీ ఫీలింగ్ ఉండకూడదు. అందువల్ల ఎప్పటికప్పుడు మనసుకు గుర్తుచేసుకోవాల్సిన విషయం ఏంటంటే.. 'మనం సంతోషంగా, ప్రశాంతంగా ఉండటానికి కావాలనే ఏం చేయొద్దనే కాన్సెప్ట్ ని ఎంచుకున్నాం' అని. కాబట్టి 'టైం వేస్ట్ అయింది... బద్ధకంగా ఉన్నామా' అనే అనుమానాలు పెట్టుకోవద్దు. ఫ్యామిలీ లైఫ్ తో పాటు ఆఫీస్ వర్క్ ప్రొడక్టివిటీ పెరగాలంటే ఇలాంటి చిన్నచిన్న బ్రేక్స్ చాలా అవసరం.

రూల్స్ పెట్టొద్దు

ఎజెండా లేకుండా ఫ్యామిలీతో కూర్చుని టైం గడపడం ఎలా? అనే సందేహం అందరికీ వస్తుంది. తెలియకుండా ఒక గేమ్ లేదా యాక్టివిటీ ప్లాన్ ని బ్రెయిన్ సూచిస్తుంది. దాన్ని కంట్రోల్ చేసుకుని అప్పటి ప్రజెంట్ మూమెంట్ ని ఎంజాయ్ చేయాలి. ఒక్కోసారి పిల్లలకు బోర్ కొట్టే అవకాశం ఉంది కాబట్టి మాటలతో ఎంగేజ్ చేయొచ్చు. పిల్లలకు ఆడుకోవాలని ఉంటే ఆడనివ్వాలి. కానీ ఆటలో పేరెంట్స్ ఏ రూల్స్ పెట్టొద్దు. ఇలా చేస్తున్న కొద్దీ పిల్లలతో పాటు పెద్దలూ క్రియేటివ్ టైంని స్పెండ్ చేస్తారు.

చుట్టు పక్కల తిరిగితే చాలు

డూ నతింగ్ కోసం పార్కులు, దూర ప్రదేశాలకు వెళ్లడం కరెక్ట్ కాదు. చుట్టుపక్కల పరిసరాల్లోనే టైం స్పెండ్ చేయాలి. ఫిట్ నెస్ గోల్స్ ని పక్కనబెట్టి, పిల్లలతో ఇంటి చుట్టూ నాలుగు రౌండ్లు వాకింగ్ చేయొచ్చు. పువ్వులు, ఆకులు, మట్టిని చూపించి పిల్లలకు వాటి కలర్స్ ఏంటో చెప్పొచ్చు. చల్లటి గాలులను ఎంజాయ్ చేయొచ్చు. నడుస్తున్న అడుగుల చప్పుళ్లను అబ్జర్వ్ చేయొచ్చు. ఇవన్నీ డూ నతింగ్ టైంలో చేస్తే, పిల్లలు పేరెంట్స్ తో పాటు నేచరికి కూడా కనెక్ట్ అవుతారు. అయితే ఉదాహరణకు చెప్పిన పనులను పనికట్టుకుని చేయొద్దు సుమీ.

చదవడానికి కూర్చుంటే ఫోన్ చూస్తున్నారా? ఈ చిట్కాలతో ఏకాగ్రత పెంచుకోండి!

- చదివేటప్పుడు ఫోన్‌ను మరో గదిలో ఉంచితే బెటర్
- అవసరం లేని నోటిఫికేషన్లు ఆఫ్ చేస్తే మేలు
- రోజువారీ చదువు లక్ష్యాలు నిర్ణయించుకుంటే ఉపయోగకరం
- **25** నిమిషాల చదువు, **5** నిమిషాల విరామం పాటించాలని సూచన
- ఫోన్ వాడకానికి నిర్దిష్ట సమయం కేటాయించుకుంటే మేలు

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మొబైల్ ఫోన్ పెద్ద ఆటంకంగా మారుతోంది. పుస్తకం ముందు కూర్చున్నా.. ఫోన్‌లో మెసేజ్ వచ్చిందేమోనని చూడటం, సోషల్ మీడియాలో రీల్స్ స్క్రోల్ చేయడం, నోటిఫికేషన్లు చెక్ చేయడం అలవాటుగా మారింది. దీంతో చదువుపై ఏకాగ్రత తగ్గడమే కాకుండా, అనుకున్న సమయంలో సిలబస్ పూర్తి చేయడం కూడా కష్టమవుతుంది. అయితే కొన్ని చిన్న మార్పులతో ఫోన్ వాడకాన్ని నియంత్రించి చదువుపై దృష్టి పెట్టవచ్చు. చదువుకునే సమయంలో ఫోన్‌ను పక్కనే పెట్టుకోకుండా మరో గదిలో ఉంచడం మంచిది. అది సాధ్యం కాకపోతే సైలెంట్ మోడ్‌లో పెట్టాలి. అవసరం లేని నోటిఫికేషన్లను ఆఫ్ చేయాలి. ఇలా చేయడం వల్ల ప్రతి కొన్ని నిమిషాలకు ఫోన్ చూసే అలవాటు తగ్గుతుంది. చదువు ప్రారంభించే ముందు ఆ రోజు పూర్తి చేయాల్సిన పనులను నిర్ణయించుకోవాలి. ఉదాహరణకు ఒక అధ్యాయం చదవడం, 20 ప్రశ్నలు సాధన చేయడం వంటి చిన్న లక్ష్యాలు పెట్టుకోవాలి. లక్ష్యం స్పష్టంగా ఉంటే చదువుపై దృష్టి నిలపడం సులభమవుతుంది. ఒకేసారి గంటల తరబడి చదవాలని ప్రయత్నించకుండా, 25 నిమిషాలు ఏకాగ్రతతో చదివి ఐదు నిమిషాలు విరామం తీసుకోవచ్చు. ఈ పద్ధతిని క్రమం తప్పకుండా పాటిస్తే అలసట తగ్గి చదువుపై ఆసక్తి పెరుగుతుంది. విరామ సమయంలోనూ సోషల్ మీడియా చూడకుండా కాసేపు నడవడం, నీళ్లు తాగడం మంచిది. చదువుకోవడానికి ప్రశాంతమైన ప్రదేశాన్ని ఎంచుకోవాలి. టేబుల్‌పై అవసరమైన పుస్తకాలు, నోట్స్ మాత్రమే ఉంచాలి. చదువుతున్న సమయంలో చాటింగ్, వీడియోలు చూడటం వంటి పనులకు దూరంగా ఉండాలి. చదువుకునేటప్పుడు ఫోన్ అవసరమైతే ఇతర యాప్‌లను బ్లాక్ చేసే ఫోకస్ ఫీచర్లు ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఫోన్‌ను పూర్తిగా మానేయడం కంటే దాని వినియోగానికి సమయం నిర్ణయించుకోవడం ప్రయోజనకరం. రోజూ ఇదే పద్ధతిని పాటిస్తే ఏకాగ్రత మెరుగుపడటంతో పాటు చదువును ప్రణాళిక ప్రకారం పూర్తి చేసే అవకాశం పెరుగుతుంది.

ప్రతిసారి ఫేషియల్ చేయిస్తున్నారా..? మీ చర్మానికి ఎంత డేంజరో తెలుసా?

ఫేషియల్ వల్ల చర్మం మెరుస్తుంది. అయితే.. రెగ్యులర్ గా ఫేషియల్ చేయించుకోవడం వల్ల చర్మానికి హాని కలుగుతుంది. అందువల్ల ఫేషియల్ వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్ ఏంటో తెలుసుకోవడం చాలా అవసరం. ఫేషియల్స్ లో ఉపయోగించే సొల్యూషన్స్, క్రీమ్స్ లో కెమికల్స్ ఎక్కువగా ఉంటాయి. అవి చర్మ కణాలను డ్యామేజ్ చేస్తాయి. వాటివల్ల చర్మంపై దురద వస్తుంది. మచ్చలు కూడా ఏర్పడతాయి. ఫేషియల్స్ చేసేటప్పుడు స్క్రబ్ చేయడం వల్ల చర్మంలో ఉండే మాయిశ్చరైజర్ పోయి చర్మం పై పొర డ్యామేజ్ అయ్యే అవకాశం కూడా ఉంది. ఫేషియల్స్ చేసేటప్పుడు ఉపయోగించే కెమికల్స్ పడకపోతే చర్మం ఎర్రగా మారుతుంది. అంతేకాదు, కొన్నిసార్లు చర్మం వాపొస్తుంది కూడా. ఫేషియల్ తర్వాత చాలామందికి పింపుల్స్ సమస్య పెరుగుతుంది. ఎందుకంటే ఫేషియల్స్ తర్వాత చర్మంపై రంధ్రాలు తెరుచుకోవడం వల్ల సెబమ్ ఉత్పత్తి అయి.. మొటిమలు వస్తాయి. అలాగే బ్లాక్ హెడ్స్ తొలగించేటప్పుడు బ్యూటీషియన్స్ చేతి వేళ్లు లేదా పరికరాలు ఉపయోగిస్తారు. ఇలా చేసేటప్పుడు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. గాయాలు, గీతలు ఏర్పడతాయ్. అందువల్ల ఫేషియల్ చేయించుకునేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరంటే వాళ్ల దగ్గర కాకుండా ఎక్స్ పర్ట్స్ దగ్గర మాత్రమే ఫేషియల్స్ చేయించుకోవాలి. ఇంట్లో అందుబాటులో ఉండే ఫ్రూట్స్ తో ఫేస్ ప్యాక్స్ వేసుకున్న ఫెషియల్ గ్లో వస్తుంది. అదెలాగంటే..

బొప్పాయితో

ఒక కప్పు బొప్పాయి ముక్కల్ని మిక్సీలో వేసి పేస్ట్ చేయాలి. ఆ మిశ్రమంలో ఒక టేబుల్ స్పూన్ తేనె కలిపి ముఖానికి రాసుకోవాలి. 15-20 నిమిషాల తర్వాత చల్లని నీళ్లతో ముఖాన్ని కడిగి మెత్తని టవల్ తో తుడుచుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే ఫేషియల్ గ్లో వస్తుంది.

అరటితో

అరటిపండుని గుజ్జులా చేసి ఒక టీ స్పూన్ తేనె, కొద్దిగా నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకోవాలి. 20 నిమిషాల తర్వాత చల్లని నీళ్లతో కడిగేయాలి. ఈ ప్యాక్ ఎలాంటి చర్మానికి అయినా మంచి ఫలితం ఇస్తుంది. ముఖ్యంగా జిడ్డు చర్మం వాళ్లకి బాగా ఉపయోగపడుతుంది. ఇందులోని విటమిన్ -బి6, జ,ాలు చర్మాన్ని రిఫ్రెష్ చేస్తాయి.

పీఎంఓఎస్ ప్రభావం శరీరమంతటా

పాలీఎండోక్రైన్ మెటబాలిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీఎంఓఎస్) ఒక్క అండాశయ తిత్తులకే పరిమితం కాదు. శరీరం మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. ఒకప్పుడు పీసీఓఎస్‌గా పిలుచుకునే ఇది హార్మోన్లు, జీవక్రియలతో ముడిపడిన సమస్య. రుతుక్రమం, సంతాన సమస్యలతో పాటు మధుమేహం వంటి దీర్ఘకాల జబ్బుల ముప్పు పెరిగేలా చేస్తుంది.
ఆ తిత్తులు అపరిపక్వ అండాలే
పీఎంఓఎస్ అనగానే చాలామంది తిత్తుల (సిస్ట్‌) గురించే ఆందోళన చెందుతుంటారు. నిజానికిది అండాశయాలు అవసరానికి మించి హార్మోన్లను విడుదల చేయటం వల్ల తలెత్తే సమస్య. ఇందులో మెదడు, అండాశయాల్లో పుట్టుకొచ్చే హార్మోన్ల మధ్య పరస్పర సంబంధం కీలకపాత్ర పోషిస్తుంది. ముందుగా మెదడులోని హైపోథలమస్ నుంచి విడుదలయ్యే గొనడోట్రోఫిన్ రిలీజింగ్ హార్మోన్ పీయూషగ్రంథిని ప్రేరేపిస్తుంది. అప్పుడు ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ పుట్టుకొచ్చి, అండాశయాలను ఉత్తేజితం చేస్తుంది. దీంతో ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు తయారవుతాయి. ఈస్ట్రోజన్ ఒక స్థాయికి చేరుకోగానే పీయూషగ్రంథి ల్యూటినైజింగ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసి, అండం విడుదలను ప్రేరేపిస్తుంది. ఈస్ట్రోజన్ మరీ ఎక్కువగా ఉత్పత్తి అయితే హార్మోన్ల సమాచార వ్యవస్థ కుంటుపడుతుంది. ల్యూటినైజింగ్ హార్మోన్ పెరిగితే టెస్టోస్టిరాన్ వంటి మగ హార్మోన్ల మోతాదులు ఎక్కువవుతాయి. ఇవి అండాశయాల్లో అండాలు పరిపక్వమవటాన్ని, విడుదల కావటాన్ని అడ్డుకుంటాయి. ఇలా పరిపక్వం కాని అండాలే బుడిపెలు బుడిపెలుగా.. నీటి తిత్తుల్లా కనిపిస్తాయి. అయితే పీఎంఓఎస్ గల అందరిలోనూ తిత్తులు ఉండాలనేమీ లేదు.

ఇతర సమస్యలూ..

పీఎంఓఎస్ గల అందరిలో తిత్తులు ఉండకపోవచ్చు. వీరిలో మగ హార్మోన్లు పెరగటం (హైపర్‌ఆండ్రోజెనీమియా), రుతుక్రమం అస్తవ్యస్తం కావటం (ఓలిగోమెనోరియా), అండం విడుదల కాకపోవటం (అనావ్యులేషన్) వంటి సమస్యలూ కనిపిస్తుంటాయి. వీటి తీరును బట్టి పీఎంఓఎస్‌ను నాలుగు రకాలుగా (ఎ, బి, సి, డి) చెప్పుకోవచ్చు. . ఎ రకంలో మగ హార్మోన్లు ఎక్కువగా ఉండటం, నెలసరి సరిగా అవకపోవటం, అండాశయాల మీద తిత్తులు అన్నీ ఉంటాయి. రక్తపోటు, బరువు, రక్తంలో ట్రైగ్లిజరైడ్లు కూడా పెరుగుతాయి.

బి రకంలో తిత్తులు స్పష్టంగా ఉండవు. మగ హార్మోన్లు పెరుగుతాయి, అండం విడుదల కాదు.

సి రకంలో అండం బాగానే విడుదలవుతుంది గానీ మగ హార్మోన్లు పెరుగుతాయి. తిత్తులు స్పష్టంగా ఉంటాయి. చాలావరకూ ఇది సంతాన పరీక్షల సమయంలో బయట పడుతుంటుంది.

డి రకంలో మగ హార్మోన్ల లక్షణాలేవీ ఉండవు. కానీ నెలసరి సరిగా రాదు. తిత్తులు తలెత్తుతాయి.

నిర్ధారణ ఇలా

చాలావరకూ లక్షణాలను బట్టే పీఎంఓఎస్‌ను అంచనా వేస్తారు. హార్మోన్లు, గ్లూకోజు మోతాదులు తెలుసుకోవటానికి కొన్ని రక్త పరీక్షలు అవసరమవుతాయి. అల్ట్రాసౌండ్ స్కాన్‌లో తిత్తులు స్పష్టంగా కనిపిస్తాయి. ఇవి 2-9 మి.మీ. సైజులో 20 కన్నా ఎక్కువగా ఉంటే సమస్యగా నిర్ధారిస్తారు. అయితే రజస్వల అయ్యాక 18 ఏళ్లు వచ్చేంతవరకూ నిర్ధారించటం తగదు.

ఇన్సులిన్ నిరోధకతతోనే..

పీఎంఓఎస్ ఇబ్బందులకు ప్రధాన కారణం కణాలు ఇన్సులిన్‌కు సరిగా స్పందించక పోవటం (ఇన్సులిన్ నిరోధకత). దీంతో కణాల్లోకి గ్లూకోజు సరిగా వెళ్లదు. ఇలా కణాలు ఇన్సులిన్‌కు స్పందించనప్పుడు శరీరం మరింత ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇది అండాశయ హార్మోన్ల ఉత్పత్తి మీద ప్రభావం చూపుతుంది. మగ హార్మోన్ల ఉత్పత్తీ ప్రేరేపితమవుతుంది. ఇన్సులిన్ నిరోధకత బరువు పెరగటానికీ దారితీస్తుంది. మరోవైపు బరువు పెరగటమూ ఇన్సులిన్ నిరోధకతకు కారణమవుతుంది. దీని మూలంగా రక్తంలో గ్లూకోజు మోతాదులు క్రమంగా పెరుగుతూ, మధుమేహం తలెత్తే అవకాశముంది.
ఒక్క మధుమేహం ముప్పే కాదు.. అధిక బరువు, ట్రైగ్లిజరైడ్లు, చెడ్డ కొలెస్ట్రాల్ పెరగటం వల్ల గుండెజబ్బులు వచ్చే అవకాశమూ పెరుగుతుంది.

జీవనశైలితో అడ్డుకట్ట

నిజానికి పీఎంఓఎస్ తల్లి కడుపులో ఉండగానే నిర్దేశితమై ఉంటుంది. దీనికి రకరకాల జన్యువులు కారణమవుతుంటాయి. ఇవి ఉన్నా పీఎంఓఎస్ రావాలనేమీ లేదు. అతిగా తినటం, శారీరక శ్రమ చేయకపోవటం వంటివి జన్యువులను ప్రేరేపించి సమస్యకు దారితీస్తుంటాయి. కాబట్టి జీవనశైలి మార్చుకోవటం చాలా ముఖ్యం. పొట్టలో కొవ్వు, బరువు తగ్గితే దాదాపు అన్ని సమస్యలూ తగ్గుతాయి. అందువల్ల క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, సమతులాహారం తినటం వంటి జీవనశైలి మార్పులతో బరువు తగ్గించుకోవాలి.
లక్షణాలు.. ఇబ్బందులు
నెలసరి సమయానికి కాకపోవటం. కొందరికి రెండు మూడు నెలలైనా రాదు. ఒకవేళ వస్తే రుతుస్రావం ఆగదు. లేదా కొంచెం కొంచెం కనిపించొచ్చు.
బరువు పెరగటం, ఊబకాయం
గర్భధారణలో ఇబ్బంది
మొటిమలు
గడ్డం, మీసం, కాళ్లు, చేతుల వంటి భాగాల్లో వెంట్రుకలు మొలవటం
జుట్టు ఊడిపోవటం
మెడ చుట్టుపక్కల, చంకలు, గజ్జల్లో చర్మం నల్లబడటం
నిస్సత్తువ
మూడ్ మారటం
చర్మం మీద సన్న కాయల వంటివి మొలవటం

మందుల మేలు

కాస్త చిన్నవయసు వారికి నెలసరి సక్రమంగా రావటానికి హార్మోన్ మాత్రలు ఉపయోగపడతాయి.
మధుమేహంలో వాడే మెట్‌ఫార్మిన్ ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. గర్భధారణ అవకాశాలు పెరుగుతాయి.

చిక్కుళ్లు, ధాన్యాలు, బాదం వంటి వాటిల్లో ఉండే ఇనోసిటాల్స్ మేలు చేస్తాయి. ఇన్సులిన్ నిరోధకత తగ్గటానికి, నెలసరి సమయానికి రావటానికి, అండాశయాలు సరిగా పనిచేయటానికి తోడ్పడతాయి. బరువూ తగ్గుతుంది. అవసరమైతే వీటిని మందుల రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది.

థైరాయిడ్ జబ్బు, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలుంటే తగు చికిత్స అవసరం. కొందరికి మగ హార్మోన్ల ప్రభావాన్ని నిలువరించే మందులు అవసరమవుతాయి.

కంటి చూపును కాపాడే ఆహారాలు ఇవి..!

చేపలు, కోడిగుడ్లు మంచివి

క్యారెట్లు, పాలకూర, బాదం గింజలు తీసుకోవచ్చు

వీటిల్లో కంటిని కాపాడే ఇంగ్రెడియంట్లు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. మన శరీరంలో కళ్లకు ప్రాధాన్యం ఎంతో ఉంటుంది. కావాల్సిన పోషకాలు అందేలా చూసుకుంటే చాలు.. కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. అలాగే, కంటి నరాలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. మధుమేహం, బీపీ ఉన్న వారు వాటిని నియంత్రణలో పెట్టుకుని, పోషకాహారం అందించడం ద్వారా కంటిచూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. పోషకాలంటే విటమిన్ ఏ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అందించాలి.
కంటి చూపు ఎందుకు తగ్గుతుంది? అనే దానికి వయసు పెరగడం ఒక కారణం. ఫోన్లు, కంప్యూటర్ల స్క్రీన్లను గంటల తరబడి చూస్తుంటే కంటికి విశ్రాంతి తగ్గి, నష్టం జరుగుతుంది. ఇవి కాకుండా ఒత్తిడి, పోషకాల లేమితోనూ కంటి చూపు మసకబారుతుంది.

చేపలు

కంటికి చేపలు ఎంతో మంచి చేస్తాయి. చేపల్లోనూ సాల్మన్ రకం మంచివి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు. కనుక ఇవి చెడు కొవ్వులను తగ్గిస్తాయి. కళ్లు పొడిబారిపోకుండా, రెటీనాకు మేలు చేస్తాయి.

బాదం గింజలు

ఆల్మండ్స్ లో విటమిన్ ఈ తగినంత ఉంటుంది. ఇది కంటికి రక్షణనిస్తుంది. వయసు మీరడం వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ నుంచి కాపాడుతుంది. అయితే, రోజులో బాదం గింజలను ఎక్కువ కాకుండా తీసుకోవాలి. అంటే ఒకేసారి మితిమీరి తినకూడదు.

గుడ్లు

కోడి గుడ్లలో విటమన్ ఏ, లూటిన్, జియాక్సాంతిన్, జింక్ ఉంటాయి. విటమిన్ ఏ కంటి కార్నియాకు ఎంతో అవసరం. కంటిలో కనిపించే ఉపరితలాన్ని కార్నియాగా పేర్కొంటారు. లూటిన్, జియాక్సాంతిన్ కంటికి సమస్యలు రాకుండా రక్షణనిస్తాయి. రెటీనా ఆరోగ్యానికి జింక్ సాయపడుతుంది. లూటిన్, జియాక్సాంతిన్ ను మన శరీరం తయారు చేసుకోలేదు. పాలకూరలోనూ ఇవి లభిస్తాయి.

క్యారెట్లు

క్యారెట్లలోనూ విటమిన్ ఏ పుష్కలంగా లభిస్తుంది. పైన చెప్పుకున్న ప్రయోజనాలకు అదనంగా, ఇన్ఫెక్షన్ల నుంచి కూడా విటమిన్ ఏ రక్షణనిస్తుంది.

ఇలా చేస్తే.. జీర్ణక్రియకు తిరుగుండదు!

నేడు మారిన జీవనశైలి వల్ల ఎంతో మంది జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మన జీర్ణ వ్యవస్థ శరీరానికి కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సంగ్రహిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది. నోటి నుంచి పేగుల వరకు ఈ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలతో తిన్నది వంటికి కూడా పట్టదు. బరువు తగ్గుతారు. ఈ సమస్యల నుంచి బయట పడేందుకు, జీర్ణశక్తిని పెంచుకునే ఉపాయాలు ఉన్నాయి.

బాదం గింజలు

బాదం గింజల్లో మంచి పోషకాలు ఉంటాయని తెలిసిందే. విటమిన్ ఈ, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ప్రొటీన్, ముఖ్యమైన కెమికల్స్, ఫ్లావనాయిడ్, మినరల్స్ ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ కు కారణమవుతుంది. చెడు కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది. దీంతో గుండె కు కూడా రక్షణ ఏర్పడుతుంది.
అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఫలితాల ప్రకారం.. ప్రతి రోజూ బాదం తినడం వల్ల బ్యుటిరేట్ సింథసిస్ ప్రక్రియ మెరుగుపడుతుందని తెలిసింది. ఇది షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్. దీనివల్ల పేగుల ఆరోగ్యం బలపడుతుంది. పైగా బాదంలో ఉండే ఫైబర్ కూడా జీర్ణవ్యవస్థకు మంచి చేస్తుంది.

నిమ్మరసం కలిపిన నీరు

మనలో ఎక్కువ మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ దీనికి బదులు నిమ్మరసం కలిపిన నీరు తాగి చూడండి. ఇది జీర్ణ వ్యవస్థకు ప్రేరణనిస్తుంది. కడుపుబ్బరం, కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే నిమ్మరసం కడుపులోకి వెళ్లిన తర్వాత అక్కడి నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తుంది. నిమ్మలో ఉండే అసిడిటీ జీర్ణ రసాలను ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో తీసుకున్న ఆహారం కూడా చక్కగా జీర్ణమవుతుంది.

వ్యాయామం

ఉదయం వేళ వ్యాయామం మరో ముఖ్యమైన అంశం. స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. యోగా చేసుకోవచ్చు. రక్త ప్రసరణ పెరిగేలా వేగంగా నడవడం, ఏరోబిక్ వ్యాయామాలు, లేదంటే కాళ్లూ, చేతులను కదిలించేవి అయినా చేసుకోవచ్చు. దీనివల్ల కూడా జీర్ణశక్తి బలపడుతుంది. ముక్కు ద్వారా దీర్ఘ శ్వాస తీసుకుని నోటి ద్వారా విడుదల చేసేదీ అనుసరించొచ్చు.

పాక్ బౌలర్లకు ఆ టాలెంటే లేదు.. బుమ్రా ముందు వాళ్లంతా వేస్ట్

పాకిస్తాన్ క్రికెట్ అనగానే ఒకప్పుడు భీకరమైన ఫాస్ట్ బౌలర్లు గుర్తుకొచ్చేవాళ్ళు.. కానీ కాలం మారింది, ఇప్పుడు పాక్ క్రికెట్ పరిస్థితి దయనీయంగా తయారైంది. సరిగ్గా ఇదే విషయాన్ని పాకిస్తాన్ మాజీ పేసర్ వకార్ యూనిస్ ఓ పోడ్‌కాస్ట్‌లో బయటపెట్టాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టీమిండియా పేస్ గన్ జస్‌ప్రీత్ బుమ్రా దెబ్బకు పాక్ బౌలర్లు ఎక్కడా నిలవలేరని, అసలు బుమ్రా దరిదాపుల్లోకి కూడా ఎవరూ రాలేరని కుండబద్దలు కొట్టాడు. పాకిస్తాన్ మాజీ ఆటగాడే స్వయంగా ఇండియన్ ప్లేయర్ల గొప్పతనాన్ని ఒప్పుకోవడం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

పాక్‌కు ఆ తలరాత లేదు.. బుమ్రాతో పోలికేంటి?:

పాకిస్తాన్ బౌలర్లు తమ జట్టును ఎప్పుడూ గెలిపించలేకపోతున్నారని పరోక్షంగా ఎద్దేవా చేస్తూ వకార్ యూనిస్ అసలు నిజాలని బయట పెట్టాడు.

పాక్ పై బుమ్రా పగడపు కోట: 2024 టీ20 వరల్డ్ కప్‌లో న్యూయార్క్‌లో పాకిస్తాన్ గెలవాల్సిన మ్యాచ్‌ను బుమ్రా ఒక్కడూ ఎలా తిప్పికొట్టాడో వకార్ గుర్తుచేసుకున్నాడు. పాకిస్తాన్ ఆ మ్యాచ్ కోల్పోవడానికి అసలు కారణమే లేదు.. కానీ బుమ్రా దెబ్బకు రిజ్వాన్ అండ్ కో పెవిలియన్ చేరింది. పాక్ కెప్టెన్‌కు కష్టమొస్తే ఎవరో దిక్కుతోచదు.. కానీ రోహిత్ శర్మ మాత్రం బంతిని టక్కున బుమ్రా చేతిలో పెట్టి మ్యాచ్ గెలిపిస్తాడు అంటూ పాక్ బౌలర్ల అసమర్థతను ఎత్తిచూపాడు.

వైట్ బాల్ కింగ్: వైట్ బాల్ క్రికెట్‌లో జస్‌ప్రీత్ బుమ్రా లెవెలే వేరని, ఒత్తిడిలో మ్యాచ్‌లను మలుపు తిప్పే దమ్ము ఒక్క బుమ్రాకే ఉందని వకార్ కితాబిచ్చాడు.

టెస్టుల్లో బుమ్రాపై వకార్ కౌంటర్:

వైట్ బాల్‌లో బుమ్రాను పొగిడిన వకార్.. టెస్టుల విషయానికి వచ్చేసరికి తనలోని పాకిస్తానీ నైజాన్ని బయటపెట్టాడు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ స్టార్క్, జోష్ హేజెల్‌వుడ్‌లతో బుమ్రాను పోలుస్తూ.. టెస్టుల్లో బుమ్రా ఇంకా చాలా నిరూపించుకోవాలి, ఎందుకంటే అతను ఆస్ట్రేలియా పేసర్ల అంత మ్యాచ్‌లు ఆడలేదంటూ కాస్త తక్కువ చేసే ప్రయత్నం చేశాడు.

ఇండియన్ ఫ్యాన్స్ సెటైర్స్:

అయితే, వకార్ యూనిస్ చేసిన ఈ వ్యాఖ్యలపై భారత క్రికెట్ అభిమానులు సోషల్ మీడియాలో సెటైర్లు పేలుస్తున్నారు. పాకిస్తాన్‌లో దశాబ్దాలుగా ఆడితేనేం.. ఆస్ట్రేలియాలో ఒక్క టెస్టు సిరీస్ గెలవలేని పాక్ ప్లేయర్స్, మా బుమ్రా గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లే అంటూ గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. ఏది ఏమైనా, పాక్ మాజీ దిగ్గజమే స్వయంగా ఇండియన్ పేసర్ల దమ్మును ఒప్పుకోవడం ఇక్కడ అసలు విశేషం.

జస్‌ప్రీత్ బుమ్రా కెరీర్:

టెస్టులు: 52 మ్యాచ్‌లు । 234 వికెట్లు । 19.7 సగటు । 42.8 స్ట్రైక్ రేట్

వన్డేలు: 91 మ్యాచ్‌లు । 151 వికెట్లు । 23.7 సగటు

టీ20లు: 100 మ్యాచ్‌లు । 126 వికెట్లు । 6.53 ఎకానమీ

టీమిండియా టీ20 జట్టుతో కలిసి శుభ్‌మన్ గిల్ ప్రాక్టీస్.. అసలేం జరుగుతోంది?

భారత వన్డే, టెస్టు జట్ల కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ రోజు (2026, అక్టోబర్ 29, గురువారం) ఆక్లాండ్ చేరుకున్నాడు. రాబోయే సుదీర్ఘ న్యూజిలాండ్ పర్యటనలో వన్డే, టెస్టు జట్లను నడిపించేందుకు కివీస్ చేరుకున్న గిల్, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నేరుగా ఈడెన్ పార్క్ మైదానంలో టీమిండియా టీ20 జట్టు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొని అందరినీ షాక్ కి గురి చేశాడు.

ఆక్లాండ్ వేదికగానే వన్డే సిరీస్ స్టార్ట్:

నవంబర్ 4వ తేదీ నుంచి ఆక్లాండ్ వేదికగా 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుండగా, నవంబర్ 19 నుంచి వెల్లింగ్టన్‌లో 2 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటికే టీ20 సిరీస్‌ను 3--0తో దక్కించుకున్న భారత జట్టు నెట్ సెషన్‌లో తన పంజాబ్ టీమ్‌మేట్ అభిషేక్ శర్మ తో కలిసి గిల్ సుదీర్ఘంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.

ఐపీఎల్‌లో 732 రన్స్.. టీ20 జట్టులో గిల్ కి నో ఛాన్స్:

ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున 16 మ్యాచ్‌ల్లో 163.02 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 732 పరుగులు (1 సెంచరీ, 6 హాఫ్ సెంచరీలు) సాధించినప్పటికీ, ప్రస్తుతం భారత టీ20 జట్టులో గిల్‌కు చోటు దక్కలేదు. జట్టులో తీవ్ర పోటీ టీ20 జట్టులో ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజు శాంసన్, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలు ఫామ్‌లో ఉండటంతో గిల్‌కు టీ20 జట్టులో కాంపిటీషన్ పెరిగింది. డిసెంబర్ 2025లో ధర్మశాలలో దక్షిణాఫ్రికాపై గిల్ చివరి టీ20 ఆడాడు. 2027 వరల్డ్ కప్ కెప్టెన్సీ: 2027 వన్డే వరల్డ్ కప్‌లో టీమిండియాను నడిపించనున్న 27 ఏళ్ల గిల్‌ను బీసీసీఐ వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కింద జాగ్రత్తగా కాపాడుకుంటోంది. రాబోయే వన్డే, టెస్టు సిరీస్‌లకు ఆయనే కెప్టెన్ కావడంతో టీ20ల నుంచి విశ్రాంతి ఇచ్చారు.

వన్డేల్లో శుభ్‌మన్ గిల్ రేర్ రికార్డ్:

వన్డే ఫార్మాట్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా కొనసాగుతున్న శుభ్‌మన్ గిల్ రికార్డులు చాలా అద్భుతంగా ఉన్నాయి.

పరుగులు: 70 మ్యాచ్‌ల్లో 3,713 పరుగులు

సగటు (ూాజవతీుుస్త్రవ): 64.01

స్ట్రైక్ రేట్: 103.31

సెంచరీలు/హాఫ్ సెంచరీలు: 11 శతకాలు, 20 అర్ధ శతకాలు!

4-0 కోసం టీమిండియా గురి.. కుల్దీప్, వరుణ్‌కు ఛాన్స్? న్యూజిలాండ్‌కు మరో షాక్ తప్పదా!

న్యూజిలాండ్ గడ్డపై భారత క్రికెట్ జట్టు మరో విజయానికి సిద్ధమైంది. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న టీమిండియా.. రేపు ఆక్లాండ్‌లో జరిగే నాలుగో టీ20లోనూ గెలిచి ఆధిక్యాన్ని 4-0కు పెంచాలని పట్టుదలగా ఉంది. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న న్యూజిలాండ్.. సత్తా చాటాలని చూస్తోంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపుతో పాటు జట్టులోని రిజర్వ్ ఆటగాళ్లకు అవకాశాలు దక్కుతాయా? అనే ఆసక్తి కూడా నెలకొంది.

కుల్దీప్, వరుణ్‌కు అవకాశం దక్కేనా?

సిరీస్ ఇప్పటికే భారత్ చేతిలోకి రావడంతో తుది జట్టులో ప్రయోగాలు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తికి అవకాశం కల్పించే అంశాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలించవచ్చు. బ్యాటింగ్‌ను ఎనిమిదో స్థానం వరకు బలోపేతం చేస్తూ భారత్ ఆడుతున్న విధానం ఇప్పటివరకు మంచి ఫలితాలనే ఇచ్చింది. అయితే నాలుగో టీ20లో అక్షర్ పటేల్ లేదా అద్భుత ఫామ్‌లో ఉన్న నమన్ ధీర్‌కు విశ్రాంతినిస్తే.. కుల్దీప్ లేదా వరుణ్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. న్యూజిలాండ్‌పై కుల్దీప్ రికార్డు కూడా అతడికి అనుకూలంగా ఉంది. ముఖ్యంగా గ్లెన్ ఫిలిప్స్‌ను ఐదు ఇన్నింగ్స్‌ల్లో నాలుగుసార్లు అవుట్ చేశాడు. అక్షర్ కూడా ఫిలిప్స్‌ను ఐదుసార్లు పెవిలియన్‌కు పంపాడు. దీంతో భారత స్పిన్నర్ల ఎంపిక ఈ మ్యాచ్‌లో ఆసక్తికరంగా మారింది. ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్నారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ విధ్వంసకర ఫామ్‌లో ఉన్నాడు. వెల్లింగ్టన్‌లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ సాధించి న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అంతర్జాతీయ టీ20ల్లో అతడికది నాలుగో సెంచరీ. టీ20 క్రికెట్లో అతడికి 11వ శతకం కాగా, భారత బ్యాటర్లలో టీ20ల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. 2025 నుంచి టీ20ల్లో అభిషేక్ 200.6 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధిస్తుండటం అతడి దూకుడుకు నిదర్శనం. న్యూజిలాండ్ బౌలర్లు జాకబ్ డఫీ, కైల్ జేమీసన్‌పై కూడా అతడు భారీ స్ట్రైక్‌రేట్లతో పరుగులు చేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ గాయం నుంచి కోలుకోకపోతే వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కవచ్చు. అభిషేక్‌తో కలిసి అతడు ఎలా ఆడతాడన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది.

గాయాలతో న్యూజిలాండ్‌కు కష్టాలు

భారత్‌ను నిలువరించడంలో న్యూజిలాండ్ బౌలర్లు విఫలమవుతున్నారు. ఇప్పటికే హెన్రీ అందుబాటులో లేకపోగా, కాలి కండరాల గాయంతో లాకీ ఫెర్గూసన్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. వెల్లింగ్టన్‌లో పవర్‌ప్లేలోనే భారత్ రికార్డు స్థాయిలో 118 పరుగులు సాధించడం కివీస్ బౌలింగ్ వైఫల్యాన్ని స్పష్టం చేసింది. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ బంతితో రాణిస్తున్నా.. మిగతా బౌలర్ల నుంచి తగిన సహకారం లభించడం లేదు. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ బ్యాటర్లకు అనుకూలంగా ఉండటంతో భారత బ్యాటింగ్‌ను కట్టడి చేయడం కివీస్‌కు పెద్ద సవాలే.

ఈడెన్ పార్క్‌లో ప్రేక్షకుల రికార్డు!

ఈ మ్యాచ్‌కు దాదాపు 40 వేల మంది ప్రేక్షకులు హాజరవుతారని అంచనా. న్యూజిలాండ్‌లో ద్వైపాక్షిక సిరీస్ మ్యాచ్‌కు ఇదే అత్యధిక ప్రేక్షకుల హాజరుగా నిలిచే అవకాశం ఉంది. 2019లో ఇదే వేదికపై భారత్ పురుషుల, మహిళల జట్ల మ్యాచ్‌లకు కలిపి నమోదైన 36,523 మంది హాజరు రికార్డును ఈసారి అధిగమించే అవకాశం ఉంది. టీ20ల్లో న్యూజిలాండ్‌పై భారత్ ఇప్పటివరకు 34 మ్యాచ్‌లు ఆడగా 22 విజయాలు సాధించింది. కివీస్‌పై వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత్.. ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకుంటుంది.

కత్రినను అందుకే దేవతాసుందరిగా ఆరాధిస్తారు!

క్లిష్టమైన బంగారు పూసల పనితనంతో మెరిసిపోతున్న శివాని నగరం

కత్రిన కైఫ్‌ను అభిమానులు ఎందుకు దేవతాసుందరిగా, టైమ్‌లెస్ బ్యూటీగా ఆరాధిస్తారో మరోసారి రుజువు చేసింది ఈ తాజా -వోగ్ ఇండియా- కవర్ షూట్. అభూ జానీ సందీప్ ఖోస్లా డిజైనర్ డ్రెస్.. దానికి తగ్గట్టుగా అమర్చిన పార ట్రెడిషనల్ మోడరన్ కాంబినేషన్ జ్యూవెలరీలో ఈ బ్యూటీ రాచరికపు కన్నె సిరిలా మెరిసిపోయింది. దశాబ్దాలు గడుస్తున్నా తన గ్లామర్, డిగ్నిటీ, ప్లాటినం బాడీ లాంగ్వేజ్ ద్వారా ఫ్యాషన్ ప్రపంచంలో క్యాట్ ఐకానిక్ స్టాండర్డ్స్‌ను కంటిన్యూ చేస్తోంది. ఈ వోగ్ కవర్ పేజీలో కత్రిన ప్రదర్శించిన ఎలిగెన్స్, డివైన్ ప్రెజెన్స్ తన ప్రతిష్టను మరింత పెంచాయి.

ఈ కవర్ షూట్‌లో కత్రిన ఫ్యాషన్ సెన్స్ ప్రత్యేకంగా నిలుస్తుంది. రాయల్ వైట్ అండ్ సిల్వర్ ఎత్నిక్ వేర్‌కి ఆభరణాల ఎంపిక ఎంతో రీచ్‌గా ఉంది. ఎంపిక చేసుకున్న ఇయర్ రింగ్స్, సిల్వర్ గాజులు క్లాసిక్ స్టైల్ క పూర్తి రూపానిచ్చాయి. మినిమల్ మేకప్, నాచురల్ హెయిర్‌స్టైలింగ్ ద్వారా --అందం అనేది కష్టపడి సాధించేది మాత్రమే కాదు.. మనసులో నుంచి పొంగిపొర్లే సహజమైన ఆనందం-- అనే విషయాన్ని స్పష్టంగా చాటిచెప్పారు. గడిచిన కొద్దికాలంలో కత్రిన వ్యక్తిగత జీవితంలో విక్కీ కౌశల్‌తో వైవాహిక బంధం.. అలాగే తల్లిగా బాధ్యతల్లో వచ్చిన మార్పులు తనలో ఒక కొత్త పరిపక్వతను, మానసిక శాంతిని నింపాయి. -మామ్- అయ్యాక కత్రిన ముఖంలో ఒక ప్రత్యేకమైన ప్రశాంతత, పరిపూర్ణత స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌ను పాటిస్తూనే.. కేవలం గ్లామరస్ రోల్స్ మాత్రమే కాకుండా తన ఆలోచనా విధానానికి తగ్గట్టుగా వైవిధ్యమైన పాత్రలను మాత్రమే ఎంచుకునే ధోరణి ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం కత్రిన కేవలం నటనకే పరిమితం కాకుండా తన సొంత బ్యూటీ బ్రాండ్ -కేబ్యూటీ- బిజినెస్‌ను విస్తరించడంపైనా.. ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌లపైనా దృష్టి పెట్టారు. -మెర్రీ క్రిస్మస్-, -టైగర్ 3- సినిమాలతో మెప్పించిన తర్వాత ఈ ఏడాది కంటెంట్ ఆధారిత చిత్రాల్లో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఫర్హాన్ అఖ్తర్ కాంబినేషన్‌లో అనుకున్న భారీ ప్రాజెక్ట్‌తో పాటు పలు ఆసక్తికరమైన కథలు చర్చల దశలో ఉన్నాయి. మల్లీశ్వరిగా తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్న కత్రిన.. ఏజ్ లెస్ బ్యూటీగా వెలుగొందుతోంది. మామ్ అయ్యాక రూపం మారిపోయిందని కొన్ని కామెంట్లు వినిపించినా.. తిరిగి కంబ్యాక్ ఎలా ఉంటుందో చూపిస్తోంది. ఫిట్నెస్ ఫ్రీక్‌గా తన గ్లామర్ కించిత్ చెదరదని నిరూపిస్తోంది. ఎంతమంది కొత్త కథానాయికలు వచ్చినా.. తనదైన ప్రత్యేక శైలితో -దేవతాసుందరి-గా తన స్థానాన్ని కత్రిన ఎప్పటికీ చెక్కుచెదరకుండా కాపాడుకుంటోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965